ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 20-11-2026 | Friday 20 November, 2026 | విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 01 సంచిక: 285 | Vol.No 01 Issue No . 285 | Vijayawada | www.visionandhra.in

మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలే

రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్



– భారీ ప్రాజెక్టులకు ఎంఎస్ఎంఈల అనుసంధానం

– ప్రతి పారిశ్రామిక క్లస్టర్‌కూ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలి

– పారిశ్రామిక అవసరాలకు ల్యాండ్ బ్యాంక్... అవసరమైతే సూతన పాలసీ

– సైబరాబాద్ తరహాలో వైజాగ్ బే-టెక్ సిటీ

– సూర్యలంక, గండికోటలకు టూరిజం మాస్టర్ ప్లాన్

– విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనామిక్ రీజియన్లపై ముఖ్యమంత్రి సమీక్ష

– రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

అమరావతి, నవంబర్ 19: (విజన్ ఆంధ్ర)

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలు అభివృద్ధికి బ్లూప్రింట్ వంటివని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలపై అధికారులు రూపొందించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఒకేసారి సమీక్ష నిర్వహించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ మూడు ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి భర్తీ చేయాలని, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెట్టడం మాత్రమే అభివృద్ధి కాదని.. వాటి ద్వారా రాష్ట్ర ప్రజల ఆదాయాలు పెరగాలని, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని... దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, వనరులు, అవకాశాలను వినియోగించుకుంటూ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ అవసరమైన మేరకు మార్పులు చేయాలని సూచించారు. మూడు రీజియన్లల్లో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికల అమల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కచ్చితంగా ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ప్రణాళికల అమల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే... ఆ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధుల సహకారం కూడా తీసుకుని ప్రభుత్వం యంత్రాంగం పని చేయాలని సూచించారు. అలాగే ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేయడంతోపాటు... వివిధ రూపాల్లో వారినీ భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద 60 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,180 కోట్లతో సిద్ధం చేసి ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పోర్టు ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి

విశాఖపట్నం ఎకనమిక్ రీజియనల్ ప్రణాళికలో భాగంగా యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ అని పేరు పెట్టారు. వివిధ పేర్లను పరిశీలించిన అనంతరం సీఎం చంద్రబాబు విశాఖ బే-టెక్ సిటీ పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ నగరంలో సైబరాబాద్ పేరుతో ఓ నగరాన్ని అభివృద్ధి చేసినట్టుగానే బే-టెక్ సిటీ పేరుతో విశాఖకు అనుబంధంగా మరో నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో నగర మేయర్‌కు చోటు కల్పించాలని సీఎం సూచించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించి 167 ప్రాజెక్టులకు గానూ... 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చాయని సీఎం వివరించారు. విశాఖకు చెరో వైపు ఉన్న విజయనగరం, అనకాపల్లి వైపు అభివృద్ధి జరుగుతోందని... ఆ ప్రాంతాల్లో అవసరమైన మేరకు ముందుగానే భూమిని గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు.

ముగ్గురు దేశాల రాయబారుల నుంచి
ధ్రువీకరణ పత్రాలు స్వీకరించిన రాష్ట్రపతి

గ్రీస్, స్పెయిన్, నేపాల్ రాయబారుల పత్రాలను అందుకున్న ద్రౌపదీ ముర్ము







న్యూఢిల్లీ: నవంబర్ 19: (విజన్ ఆంధ్ర)

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గ్రీస్, స్పెయిన్, నేపాల్ దేశాల రాయబారుల నుంచి అధికారిక ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు. గురువారం (నవంబర్ 19) రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముగ్గురు దేశాల రాయబారులు తమ పరిచయ పత్రాలను రాష్ట్రపతికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రీస్ రాయబారి జార్జియోస్ పెట్మెజాకిస్, స్పెయిన్ రాయబారి ఆల్ఫ్రెడో మార్టినెజ్ సెరానో, నేపాల్ రాయబారి డాక్టర్ నిశ్చల్ నాథ్ పాండే తమ అధికారిక పత్రాలను ద్రౌపదీ ముర్ముకు అందజేశారు. భారతదేశంలో తమ దేశాల తరఫున అధికారికంగా బాధ్యతలు నిర్వహించేందుకు నియమితులైన రాయబారులు రాష్ట్రపతికి పరిచయ పత్రాలను సమర్పించడం సంప్రదాయ కార్యక్రమం. ఈ సందర్భంగా ఆయా దేశాలతో భారతదేశానికి ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు, దౌత్య సహకారం, పరస్పర భాగస్వామ్యానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఉంటుందీ?. గ్రీస్, స్పెయిన్, నేపాల్ దేశాలతో భారత్ స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో అధికారికంగా నిర్వహించబడింది.

దేశాభివృద్ధిలో పరిశ్రమల పాత్ర కీలకం..

ఆత్మపరిశీలనతో ముందడుగు వేయాలి

– ఫిక్కీ శతాబ్ది సమావేశంలో ప్రధాని మోదీ పిలుపు..
ప్రపంచ మార్కెట్లను అందిపుచ్చుకోవాలి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి.. వచ్చే 20 ఏళ్ల పెట్టుబడి నిర్ణయాల్లో 'భారత్ ప్రథమం' ప్రాధాన్యం కావాలి



న్యూఢిల్లీ: నవంబర్ 19: (విజన్ ఆంధ్ర) దేశ ఆర్థిక అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధన, ప్రపంచ మార్కెట్లలో భారత పరిశ్రమల పోటీతత్వాన్ని పెంపొందించడంలో పారిశ్రామిక రంగం కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పరిశ్రమలు తమ సామర్థ్యాలను ఆత్మపరిశీలన చేసుకుని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సాంకేతికత, నాణ్యత, ఉత్పత్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో తీసుకునే దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయాల్లో 'భారత్ ప్రథమం' అనే ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.గురువారం న్యూఢిల్లీలో ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సును ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. ఫిక్కీ వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకోవడం ప్రత్యేక సందర్భమని పేర్కొన్నారు. కాలానుగుణంగా మారుతూ, దేశ ఆర్థిక ప్రయాణంలో క్రియాశీల పాత్ర పోషిస్తూ ఒక సంస్థ వందేళ్ల పాటు కొనసాగడం గొప్ప విజయమని అభినందించారు. సంస్థ గత, ప్రస్తుత సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పులు

గత వందేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక పరిణామాలను ఎదుర్కొందని ప్రధాని గుర్తుచేశారు. లైసెన్స్, కోటా విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల జాతీయీకరణ ప్రయోగాలు, ఆర్థిక బలహీనతల దశలను దాటి దేశం ముందుకు సాగిందన్నారు. గత 12 ఏళ్లలో యువత, రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తల కృషితో ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ముందంజలో ఉందని, పేదరికం నుంచి ప్రజలు బయటపడుతున్న వేగం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపారు.ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం గత 12 నుంచి 13 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని ప్రస్తావించారు. గతంలో పేదరిక నిర్మూలన నినాదాలు ఉన్నప్పటికీ సరైన విధానాలు, అమలు లోపించాయని వ్యాఖ్యానించారు. సరైన విధానాలు, నిబద్ధతతో పనిచేస్తే పెద్ద స్థాయిలో మార్పులు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై

జగన్ విషప్రచారం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

– ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



మంగళగిరి నవంబర్ 19: (విజన్ ఆంధ్ర)

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ, విద్యా విధానం, ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి వైసీపీ నాయకత్వం మాట్లాడుతుంటే 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా' ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయాక ఏది పడితే అది మాట్లాడొచ్చనే ఒక వింత పోకడకు వైసీపీ నేతలు తెరలేపారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించి, పదవి నుంచి దించేసిన సమయంలో రాష్ట్రంలో మీరు ఎన్ని వేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి వెళ్లారో ఒకసారి గుర్తు చేసుకోవాలి. గత ఐదేళ్ల పాలనలో విద్యా రంగాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసి, విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది వైసీపీ ప్రభుత్వమే. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు తమ సర్టిఫికెట్లు కూడా తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలేజీ యాజమాన్యాలను, తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసి, ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.


విద్యా వ్యవస్థ నుంచి అభివృద్ధి పనుల వరకు ప్రతి రంగంలోనూ

బకాయిలు పెట్టిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానిదే

గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో చిన్న పిల్లల చదువుల నుంచి సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ, రైతులు, కాంట్రాక్టర్ల వరకు అన్ని రంగాల్లో వేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గతంలో అమ్మఒడి (తల్లికి వందనం), సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ పథకాలలో భారీగా బకాయిలు పెట్టారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పనులు చేసిన కాంట్రాక్టర్లకు, గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ నిధులతో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టారు. పైగా, సీఎఫ్ఎంఎస్ అనే కొత్త విధానాన్ని అడ్డుపెట్టుకుని, కేవలం మీ మద్దతుదారులకు, మీకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే నిధులు మంజూరు చేసి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు.

తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై
జగన్మోహన్ రెడ్డి పెదవి విప్పాలి.

– అక్రమాస్తుల కేసులో ఈడీ ఛార్జిషీటు వేస్తే సమాధానం చెప్పే బాధ్యత జగన్మోహన్ రెడ్డికి లేదా?
– ఈడీ చార్జీషీట్ పై తేలు కుట్టిన దొంగల జగన్ ఎందుకు ఉంటున్నారు.



మంగళగిరి నవంబర్ 19: (విజన్ ఆంధ్ర)

జగన్మోహన్ రెడ్డిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై గొడ్డలి పార్టీ నేతల పెదవి విప్పాలని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అక్రమాస్తుల కేసులో ఈడీ ఛార్జిషీటు వేస్తే సమాధానం చెప్పే బాధ్యత జగన్మోహన్ రెడ్డికి లేదా? అని ప్రశ్నించారు. ప్రత్యేక విమానంలో వచ్చి ఏకధాటిగా రెండు గంటలకు పైగా కూటమి ప్రభుత్వంపై బురద జల్లే జగన్ రెడ్డి ఈడీ విచారణపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. అసత్యాలను పెద్ద పెద్ద అక్షరాలతో రాస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సాక్షి పత్రిక జగన్మోహన్ రెడ్డి కేసులపై చిన్న వార్త కూడా ఎందుకు రాయలేదని అని ధ్వజమెత్తారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. హాలీవుడ్ సినిమాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా జగన్మోహన్ రెడ్డి అవినీతి సామ్రాజ్యం స్థాపించారని విమర్శించారు. లిక్కర్ కుంభకోణం నుండి శాండ్ స్కామ్ వరకు వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్న దీనిపై ఆ పార్టీ నాయకులు తెలు కుట్టిన దొంగళ్లలా ఎందుకు ఉంటున్నారని దుయ్యబట్టారు."వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమ ఆస్తులు, క్విడ్ ప్రో కో వ్యవహారాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్ల ద్వారా మరోసారి వాస్తవాలు ప్రజల ముందుకు వచ్చాయి. క్విడ్ ప్రో కో-1 నుంచి క్విడ్ ప్రో కో-2 వరకు జగన్మోహన్ రెడ్డి పాత్రను దర్యాప్తు సంస్థలు సాక్ష్యాధారాలతో సహా నిర్ధారించాయి. ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన సహజ వనరులను అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్వప్రయోజనాలకు ఎలా వాడుకున్నారో ఈడీ వేసిన ఛార్జిషీట్ స్పష్టం చేస్తోంది. జగన్మోహన్ రెడ్డి పక్కన చేరిన ఎంత మంచి వ్యక్తులు, అధికారులు, పారిశ్రామికవేత్తలైనా ఆయన అవినీతి మరక అంటక తప్పదని ఈ ఛార్జిషీట్ రుజువు చేస్తుంది. ఐఏఎస్ అధికారులను సైతం జైలుకి పంపించిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. 2008 జనవరి 9న కడప జిల్లా మైలవరం మండలం తలమంచిపట్నంలో 407 హెక్టార్ల సున్నపురాయి గనులను సజ్జల కుటుంబానికి చెందిన ఈశ్వర్ సిమెంట్స్‌కు మంజూరు చేశారు. ఆ తర్వాత 8న జీవో నెం. 321 ద్వారా వాటిని దాల్మియా సిమెంట్స్‌కు కట్టబెట్టారు. ఈ లీజుల వ్యవహారంలో క్విడ్ ప్రో కో జరిగిందని కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఈడీ ఛార్జిషీట్‌లో జగన్మోహన్ రెడ్డిని ఎ1 నిందితుడిగా నమోదు చేశారు. 2010లో దాల్మియా సిమెంట్స్ షేర్లను ఫ్రాన్స్ కంపెనీ పార్వికిమ్ (ఖూ=ళీ×జ×వీ) కొనుగోలు చేయడం ద్వారా వచ్చిన రూ. 139 కోట్లను జగన్మోహన్ రెడ్డి తన కంపెనీలకు మళ్లించారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ మాఫియా తరహాలో 'టన్నులు' అనే కోడ్ భాషను ఆ రోజుల్లోనే ఉపయోగించారంటే జగన్ క్రిమినల్ మైండ్ సెట్ ఏంటో అర్థమవుతుంది. ఈడీ స్వాధీనం చేసుకున్న పెన్‌డ్రైవ్ సమాచారం ప్రకారం రూ. 55 కోట్లు హవాలా రూపంలో చేరింది వాస్తవం కాదా? సజ్జల కుటుంబానికి చెందిన ఈశ్వర్ సిమెంట్స్‌కు రూ. 2.14 కోట్ల మనీలాండరింగ్ జరిగిందని దర్యాప్తు సంస్థలు స్పష్టం చేయడం నిజం కాదా? దీనిపై గొడ్డలి పార్టీ అధినేత, ఆ పార్టీ నాయకులు ఏం సమాధానం చెబుతారు."

అవినీతి సొమ్ము వాటాలను పంచడానికి

కూడా మనసు రాదా జగన్?

"దేశ చరిత్రలో 'క్విడ్ ప్రో కో' అనే పదాన్ని తొలిసారిగా సృష్టించిన వ్యక్తి జగన్. బోగస్ కంపెనీల ద్వారా రూ. 43 వేల కోట్ల అవినీతి సొమ్మును కూడబెట్టారు. ఈ అక్రమ సంపాదనతోనే భారతీ సిమెంట్స్ నుంచి సాక్షి పత్రిక వరకు, లోటస్ పాండ్ నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు వేల కోట్ల ఆస్తులు సమకూర్చుకున్నారు. తండ్రి అధికారంతో అవినీతి సొమ్ము సంపాధించారు.

నూతన ఎంపీటీసీలకు

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఘన సత్కారం

– ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల వ్యూహాలపై సభ్యులకు దిశానిర్దేశం

– ఐక్యత, సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని పిలుపు



వినుకొండ: నవంబర్ 19: **(విజన్ ఆంధ్ర)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కూటమి ఎంపీటీసీ సభ్యులను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఘనంగా సత్కరించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.

. త్వరలో జరగనున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన విధివిధానాలు, రాజకీయ వ్యూహాలపై సభ్యులకు పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. కూటమి పక్షాల మధ్య సంపూర్ణ సమన్వయం, ఐక్యత అత్యంత కీలకమని పేర్కొంటూ, అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని ఘన విజయం సాధించాలని పిలుపునిచ్చారు.ప్రజలు ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన పదవులకు వన్నె తెచ్చేలా పనిచేయాలని ఆయన సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారంలో ముందుండాలని, నియోజక వర్గ సమగ్రాభివృద్ధిలో నూతన సభ్యులంతా కీలక భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, కూటమి ముఖ్య నాయకులు, నూతన ఎంపీటీసీ సభ్యులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక

శుక్రవారం 20-11-2026

సంపాదకీయం

డీలిమిటేషన్ అడుగులు....

దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన డీలిమిటేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటికీ రాష్ట్రపతి అధికారికంగా ముగించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952, 1963, 1973 మరియు 2002 సంవత్సరాల్లో డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయివర్షాకాల సమావేశాలు ఇంకా ప్రొరోగ్ కానందున, కొత్త సమావేశాల కోసం 14 రోజుల గడువు అవసరం లేకుండా కేవలం 48 గంటల ముందుగా ఎంపీలకు సమాచారం ఇచ్చి ప్రత్యేక భేటీని నిర్వహించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకేతాలు ఇచ్చారు.సాధారణంగా పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుండి నాలుగు రోజుల్లోనే రాష్ట్రపతి సభను ప్రొరోగ్ చేస్తారు. కానీ, ఈసారి వర్షాకాల సమావేశాలు వాయిదా పడి 90 రోజులకు చేరువవుతున్నా సభను అధికారికంగా ముగించకపోవడంతో 2008 నాటి 87 రోజుల రికార్డు సైతం బద్దలైంది. గత ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుండి 850 వరకు పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో అది వీగిపోయింది.ఈ నేపథ్యంలో, ఈసారి పక్కా సంఖ్యాబలాన్ని కూడగట్టుకుని, ఎప్పుడైనా సరే 48 గంటల షార్ట్ నోటీసుతో సభను సమావేశపరిచి బిల్లును గట్టెక్కించాలని కేంద్రం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పలు దఫాలు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. 1952, 1955 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కొన్ని ఉమ్మడి నియోజకవర్గాలుగా ఉండేవి. వీటిలో ఒకరు సాధారణ అభ్యర్థి, మరొకరు రిజర్వుడు అభ్యర్థిగా ఉండేవారు. ఆ తరువాత ఈ విధానం మారిపోయింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను విభజించాలన్న డీ లిమిటేషన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరిగింది.ప్రస్తుతం 175 నియోజకవర్గాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వివిధ ఎన్నికల సమయంలో ఏ విధంగా పెరిగిందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 1955లో 245 నియోజకవర్గాలుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తర్వాత ఎన్నికలకు 300 స్థానాలకు చేంది తర్వాత మళ్లీ తగ్గిపోయింది. దీనికి కారణం జనాభా పెరుగుదల మేరకు డీ లిమిటేషన్ సిఫార్సులే.ఎంతమంది ప్రజలకు ఎంతమంది ప్రజాప్రతినిదులు ఉండాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు డీ లిమిటేషన్ అమల్లోకి వచ్చింది. దేశంలో 1952 నాటికి 494 పార్లమెంటు స్థానాలు ఉండేవి 1962లో 522 పార్లమెంటు స్థానాలు, 3,771 అసెంబ్లీ స్థానాలకు పెరిగాయి. 1972లో 543 పార్లమెంటు స్థానాలు 3,997 అసెంబ్లీ స్థానాలుండగా ఆ సంఖ్య 2002లో 543 పార్లమెంటు స్థానాలకు, 4,123 అసెంబ్లీ స్థానాలకు చేరింది. ప్రతి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య మారుతుంటుంది. 1953లో చంద్రశేఖర అయ్యర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా 1973లో జేఎల్ కపూర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంటు సభ్యులుండాలన్న ప్రతిపాదనలతో సంఖ్య పెరిగింది 2002లో నియమితులైన కులదీప్ సింగ్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన సిఫార్సులు 2008 నుంచి అమల్లోకి వచ్చాయి.మరోవైపు, కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియే 'డీలిమిటేషన్' ఇది మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడి ఉంది. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో స్థానాలు పెరిగి, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల (తెలుగు రాష్ట్రాలతో సహా) ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.2026 తర్వాత జనాభా గణన ఆధారంగా లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి సుమారు 850 వరకు పెరిగే అవకాశం ఉంది. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రకారం, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరుగుతాయి, కానీ జనాభా నియంత్రణ పాటించిన తెలుగు రాష్ట్రాలు , కేరళ, తమిళనాడు రాష్ట్రాల ప్రాతినిధ్యం (లోక్‌సభ సీట్లు) తగ్గుతుందనే భయం ఉంది. అభివృద్ధి, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను నష్టపరిచే విధంగా ఈ విభజన ఉండకూడదని పలువురు ఎంపీలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ బిల్లుపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి, ఇది దేశ రాజకీయ సమతుల్యతను మార్చే అవకాశం ఉన్నందున చాలా సున్నితమైన అంశంగా మారింది.రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన రెండు మూడొంతుల మెజారిటీని అడ్డదారిలో కూడగట్టుకునేందుకు అమిత్ షాకు సమయం ఇవ్వడానికే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేయకుండా జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఢిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు రొణంకి కుర్మనాథ్, ఐపిఎస్



పాడేరు, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు2026 నిర్వహణకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించనున్న రిటర్నింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండో విడతలో ఎన్నికలు జరగనున్న చింతపల్లి, జి.కె.వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన రిటర్నింగ్ అధికారులకు చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకులు శ్రీ రొణంకి కుర్మనాథ్, ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో అధికారులకు అందిస్తున్న సూచనలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధవిధానాలు, ఎన్నికల ప్రక్రియపై కల్పిస్తున్న అవగాహనను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, విధుల నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

దేశాభివృద్ధిలో పరిశ్రమల పాత్ర కీలకం..

ఆత్మపరిశీలనతో ముందడుగు వేయాలి

మొదటిపేజీ తరువాయి

ఏయే పదార్థాలను దేశంలోనే తయారు చేయగలమో ఔషధ పరిశ్రమ గుర్తించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భారీ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ పోటీని ఎదుర్కొనే సామర్థ్యం పెంచుకోవాలని అన్నారు.తుది ఔషధాల తయారీలో భారత్‌కు ఉన్న బలాన్ని, ఔషధ తయారీకి అవసరమైన ముడి పదార్థాల ఉత్పత్తిలోనూ సాధించాలని సూచించారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని పేర్కొన్నారు.

ఉక్కు, అల్యూమినియం రంగాల్లో విలువ జోడింపు

ఇనుము, ఉక్కు రంగాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని ప్రధాని వివరించారు. భారత్ భారీ మొత్తంలో ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేస్తున్నప్పటికీ, తుది ఉత్పత్తులైన ప్రత్యేక నాణ్యత కలిగిన ఉక్కును దిగుమతి చేసుకుంటోందన్నారు. ఏ రకమైన ఉక్కును దిగుమతి చేసుకుంటున్నామో పరిశ్రమలు గుర్తించి, వాటి తయారీకి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.అల్యూమినియం రంగంలోనూ ప్రత్యేక మిశ్రమ లోహాలు, ఇతర విలువైన ఉత్పత్తుల తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో బాక్సైట్ నిల్వలు ఉన్నప్పటికీ, ప్రత్యేక ఉత్పత్తుల కోసం దిగుమతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఖనిజ సంపదను ముడి పదార్థాలుగా ఎగుమతి చేయకుండా, దేశంలోనే వాటికి విలువ జోడించి అధిక ఆదాయం సాధించే దిశగా పరిశ్రమలు ముందుకు సాగాలని కోరారు.

వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాసెసింగ్ అవసరం

ప్రపంచ వ్యవసాయ ఎగుమతుల్లో భారత్ వాటా కేవలం రెండున్నర శాతం స్థాయిలోనే ఉందని ప్రధాని ప్రస్తావించారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలని సూచించారు. ఆహార శుద్ధి పరిశ్రమను పెద్ద అవకాశంగా గుర్తించి, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే కార్యక్రమాలను విస్తరించాలని అన్నారు.
గత 12 ఏళ్లలో వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో శుద్ధి చేసిన ఆహార పదార్థాల వాటా 13 శాతం నుంచి 20 శాతానికి పైగా పెరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఏ ఉత్పత్తులకు డిమాండ్ ఉందో గుర్తించి, వాటికి అనుగుణంగా ఉత్పత్తి, సేకరణ, సరఫరా వ్యవస్థలను రూపొందించాలని సూచించారు. విదేశీ మార్కెట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయాలని పరిశ్రమలకు పిలుపునిచ్చారు.

యంత్రాల తయారీలో అపార అవకాశాలు

చేతి పనిముట్లు, విద్యుత్ పనిముట్ల ఎగుమతుల్లో భారత్ వాటా తక్కువగా ఉందని ప్రధాని అన్నారు. ఈ రంగాల్లో అంతర్జాతీయ మార్కెట్లలో భారత ఉత్పత్తుల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు పరిశ్రమలు కృషి చేయాలని సూచించారు. పెద్ద కంపెనీలు చిన్న సంస్థలకు నాణ్యత, ఉత్పత్తి సామర్థ్యం పెంపొందించడంలో సహకరించాలని కోరారు.
యంత్రాల తయారీ, ప్యాకేజింగ్ పరికరాలు, నీటిపారుదల వ్యవస్థలు, పరిశ్రమలకు అవసరమైన యంత్రాల తయారీలోనూ భారత్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా ప్రపంచ దక్షిణ దేశాలకు అవసరమైన యంత్రాలను భారతీయ పరిశ్రమలు తయారు చేయగలిగితే అంతర్జాతీయ మార్కెట్లో కొత్త అవకాశాలు లభిస్తాయని తెలిపారు.
పారిశ్రామికవేత్తలను గౌరవించాలి
దేశ అభివృద్ధిలో రైతులు, చిన్న వ్యాపారులు, పరిశ్రమలు, సంపద సృష్టికర్తలు, పన్ను చెల్లింపుదారుల పాత్ర కీలకమని ప్రధాని అన్నారు. వారిని విమర్శిస్తూ, అవమానిస్తూ దేశం ముందుకు సాగలేదని వ్యాఖ్యానించారు. పారిశ్రామికవేత్తలను అనుమానంతో చూసే విధానానికి స్వస్తి పలకాలని, దేశ నిర్మాణంలో వారూ భాగస్వాములేనని గుర్తించాలని సూచించారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ఆదాయపు పన్ను శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రతి ఒక్కరినీ నేరస్తులుగా భావించడం సరికాదని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. దేశం కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఎంత కృషి చేస్తారో, పారిశ్రామికవేత్తలు, ఇతర పౌరులు కూడా అంతే బాధ్యతతో పనిచేస్తారని అన్నారు.వ్యాపార నిర్వహణ సులభతరం చేసే విధానాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. గతంలో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించామని, ఆదాయపు పన్ను మినహాయింపులు, వాపసు ప్రక్రియలను సరళీకృతం చేశామని వివరించారు. పన్ను చెల్లింపుదారుల డబ్బు అనవసరంగా వ్యవస్థలో నిలిచిపోకుండా, సాధారణంగా వారంలోపే వాపసులు అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వస్తు సేవల పన్ను సంస్కరణలతో అనేక ఉత్పత్తులపై పన్నులు తగ్గాయని, దీనివల్ల కొనుగోలు శక్తి, వినియోగం పెరిగి పరిశ్రమలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.
స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను సద్వినియోగం చేసుకోవాలి
భారత్ అనేక దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు దేశీయ పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని ప్రధాని అన్నారు. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలతో వాణిజ్య ఒప్పందాలు కుదిరినప్పుడు వాటి ప్రయోజనాలను పొందేందుకు పరిశ్రమలు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.140 కోట్ల జనాభా కలిగిన దేశీయ మార్కెట్ మాత్రమే తమ ఉత్పత్తులకు సరిపోతుందని భావించవద్దని హెచ్చరించారు. దేశీయంగా ఉత్పత్తులు అమ్ముడవుతాయనే నమ్మకంతో నాణ్యతను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. భారతీయ వినియోగదారులు కూడా ప్రపంచ స్థాయి నాణ్యత కలిగిన ఉత్పత్తులకు అర్హులని స్పష్టం చేశారు. ఎగుమతి నాణ్యత అంటూ ప్రత్యేకంగా చెప్పాల్సిన పరిస్థితి మారాలని, దేశీయ మార్కెట్ కోసం తయారయ్యే ఉత్పత్తులు కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అన్నారు.

ప్రపంచ మార్కెట్ల అవసరాలను అధ్యయనం చేయాలి

వివిధ దేశాలు, ప్రాంతాల్లో వినియోగదారుల అభిరుచులు, అవసరాలు, ఉత్పత్తుల ప్రమాణాలు భిన్నంగా ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు. వాటిని అధ్యయనం చేసేందుకు పరిశ్రమలు ప్రత్యేక బృందాలను పంపాలని, మార్కెట్ పరిశోధన చేపట్టాలని, వినియోగదారులకు అనువైన ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. ప్రపంచ మార్కెట్లలో నమ్మకం సంపాదించే నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు, సరఫరా, పంపిణీ వ్యవస్థలను కూడా బలోపేతం చేసుకోవాలని అన్నారు.ప్రభుత్వం పరిశ్రమలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, సంస్కరణల అమలులో పారిశ్రామిక రంగం నుంచి నిర్మాణాత్మక సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. వ్యాపార రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఇంకా చేపట్టాల్సిన సంస్కరణలను బహిరంగంగా తెలియజేయాలని కోరారు.

పదేళ్లలో దేశానికి ఏమిస్తారో ఆలోచించాలి

ఫిక్కీ వందేళ్ల ప్రయాణం పరిశ్రమలకు ఎంతో అనుభవాన్ని అందించిందని, మరో వందేళ్లు వేచి చూడకుండా వచ్చే పదేళ్లలో దేశానికి ఏమి చేయగలమనే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రధాని పిలుపునిచ్చారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ సాధించాలన్న సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని అన్నారు.స్వాతంత్ర్యం ఒక నినాదం మాత్రమే కాదని, అది బాధ్యతతో కూడిన సంకల్పమని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్ కూడా కేవలం నినాదంగా మిగలకుండా, 140 కోట్ల మంది ప్రజలు తమ జీవితాల్లో ఆ లక్ష్యాన్ని ఆచరణలో చూపించాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు, ప్రభుత్వం, ప్రజలు సమిష్టిగా కృషి చేస్తే దేశ అభివృద్ధి లక్ష్యాలను సాధించగలమని ప్రధాని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలే

రాష్ట్రాభివృద్ధికి బ్లూ ప్రింట్

మొదటిపేజీ తరువాయి

అలాగే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ లభ్యత తక్కువగా ఉంటుందని... దీనివల్ల పారిశ్రామికాభివృద్ధికి కొంత ఇబ్బంది ఉందన్నారు. ఈ మేరకు ఈ జిల్లాల్లో కూడా ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. దీనికోసం అవసరమైతే పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. విశాఖలో ఏడాదిలోగా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అందులోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోర్టుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు విస్తృత అవకాశాలున్నాయని, పరిశ్రమలకు అవసరమైన లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానాన్ని మెరుగుపరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతం వద్ద అవసరమైన నివాస, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలతో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు.



నాలెడ్జ్ పార్టనర్లుగా ప్రముఖ విద్యా సంస్థలు

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని సాంకేతిక, పారిశ్రామిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుపతిని గ్లోబల్ సెమీ కండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్లు వంటి రంగాలకు అనుబంధంగా డిజైన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి పారిశ్రామిక క్లస్టర్లను మరింత బలోపేతం చేయాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాల్లో ప్రధాన పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అవసరమైన విడిభాగాలు, సేవలు అందించే ఎంఎస్ఎంఈలను కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం కాకుండా, వాటి చుట్టూ స్థానికంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల నెట్‌వర్క్ ఏర్పడాలని చెప్పారు. ముఖ్యంగా పెద్ద పరిశ్రమలకు అనుసంధానించేలా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి రంగానికి అవసరమైన పూర్తి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమల వ్యర్థాల్లోని విలువైన పదార్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశాలను పరిశీలించాలని, అరుదైన ఖనిజాల వ్యర్థాల నుంచి ఇతర అవసరాలకు ఉపయోగపడే పదార్థాలను వేరు చేసే సాంకేతికతపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఖనిజ సంపద ఆధారంగా తిరుపతి ప్రాంతంలో కొత్త పెట్టుబడులకు అవకాశాలున్నాయని చెప్పారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే... అత్యధిక శాతం గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5.70 లక్షల కోట్లు వచ్చాయని సీఎం చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని.. దీన్ని మాగ్నటిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను కార్యాచరణలోకి తీసుకురావాలని, మూడేళ్లలో లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. పెట్టుబడులు ఏయే రంగాల్లో, ఏయే ప్రాంతాల్లో వస్తున్నాయో స్పష్టంగా గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల అనుభవాన్ని వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్లో ఆక్వా, కోకో, పామాయిల్ వంటి రంగాలు అతి పెద్ద ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని తెలిపారు. అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఇప్పటికే రూ. 4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు నడుస్తున్నాయని తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం వంటి పోర్టులకు మంచి కనెక్టివిటీ అందిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే క్వాంటం రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి రీజియన్ పరిధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. క్వాంటం కారిడార్ గా అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. క్వాంటం వ్యాలీతోపాటు... క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి అమరావతి కేంద్రంగా మారుతుందనన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణాలు అభివృద్ధికి కేంద్రంగా ఉంటాయని పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ప్రాంతానికి ఐఐటీ, అమరావతి ప్రాంతానికి బిట్స్ పిలానీ వంటి సంస్థలతో పాటు మూడు ప్రాంతాల్లోనూ ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య నిరంతర అవగాహన, చర్చలు జరగాలని చెప్పారు. ఐఐటీయన్లు, పాన్ ఐఐటీ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

తీర ప్రాంతం... బుద్ధిస్ట్ సర్క్యూట్లతో టూరిజం అభివృద్ధి

అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఆకర్షించేలా రహదారులు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. వచ్చే సీఐఐ సదస్సు నాటికి వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులను అరకు, లంబసింగి వంటి ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచుతూ బీచ్ రిసార్టులుగా అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక, ఓడరేవు, చినగంజాం, నిజాం పట్నం, డిండి వంటి ప్రాంతాల్లో బీచ్, ఎకో టూరిజానికి అవకాశం ఉందని తెలిపారు. పర్యాటక అభివృద్ధి పేరుతో కాలుష్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని, శ్రీశైలం సహా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని చెప్పారు. నాగార్జునకొండ, అమరావతి ప్రాంతాలను అనుసంధానిస్తూ బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ప్రణాళికలు రచించి... ఆ మేరకు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సూర్యలంక, గండికోట ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్లు రూపొందించాలని నిర్దేశించారు. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని, పెట్టుబడుల గ్రౌండింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వీకెండ్ ఎకానమీపై దృష్టి పెట్టాలని... వాణిజ్య, పర్యాటక, వినోద కార్యకలాపాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్లకు సంబంధించిన సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
శుక్రవారం 20-11-2026

విద్యార్థులకు దోమ తెరలు పంపిణి

కదిరి, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)
కదిరి రూరల్ మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం కాలసముద్రం నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పట్నం వైద్య అధికారి నవీన్ కుమార్ మరియు కదిరి పడమర మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దేవలా నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమము ఉద్దేశించి వైద్యాధికారి గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకులం యందు గల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా విద్యార్థులు దోమకాటుకు గురికాకుండా ఉచితంగా దోమతెరలను పంపిణీ చేయడం జరిగింది,

ఈ దోమతెరలు రాత్రి నిద్రపోయే సమయంలో విధిగా ఉపయోగించుకోవడం వల్ల మలేరియా డెంగ్యూ చికెన్ గునియా వంటి విష జ్వరాల బారిన పడకుండా రక్షణ కల్పించబడతారని తెలియజేశారు.

కదిరి పడమర మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవలా



నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాలు పరిశుభ్రత పాటించినప్పుడు మరియు దోమ కాటు బారిన పడకుండా కాపాడుకోవడం వల్ల వ్యాధులను భారీ నుండి పూర్తిగా రక్షణ పొందవచ్చని తెలియజేశారు

ఈ కార్యక్రమము నందు సూపర్వైజర్ విజయ శేఖర్ రావు, శశిధర్, పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు, మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కొత్తచెర్వు,నవంబర్ 19,((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)
గురువారం కొత్తచెర్వు జెడ్పిహెచ్ పాఠశాల బాలురు లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప, అసిస్టెంట్ కమిషన్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ లాజరు మరియు ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

ఓపెన్ స్కూల్ విద్యావిధానం యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. చదువు మధ్యలో మానేసిన (డ్రాప్-అవుట్) విద్యార్థులకు మరియు వివిధ కారణాల వల్ల విద్యను కొనసాగించలేకపోయిన అర్హులైన వారికి దీనిపై సరైన అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లాలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో తప్పిన విద్యార్థులతో పాటు, అంగన్వాడి వర్కర్లు, హోంగార్డ్స్, ఆశా వర్కర్లు, మహిళా సంఘ సభ్యులు మరియు చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకోవాలని కలెక్టర్ తెలియజేశారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (SHGs), మెప్మా, ఐసిడిఎస్,వైద్య ఆరోగ్య శాఖ, డ్వాక్రా, డ్వామా మొదలగు అన్ని శాఖలలో పనిచేస్తూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు కాని వారందరూ ఓపెన్ స్కూల్ విద్యావిధానం ద్వారా తమ విద్యార్హతలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీల జోరు.. అభ్యర్థుల హోరు.. పోలీసు బందోబస్తు మధ్య దొన్నికోటలో ప్రశాంతంగా నామినేషన్లు!



- నాలుగు పంచాయతీలు.. 47 మంది అభ్యర్థులు..

దొన్నికోట కేంద్రంగా ఎన్నికల సందడి

- టీడీపీ నుంచి ఐదుగురు.. వైసీపీ నుంచి ఇద్దరు..

బీజేపీ నుంచి ఒకరు.. స్వతంత్రంగా మరొకరు పోటీ

నల్లమాడ, నవంబర్ 19 – ((విజన్ ఆంధ్ర) విలేకరి)
నల్లమాడ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మండలంలోని నాలుగో నామినేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన దొన్నికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. దొన్నికోటతో పాటు పులగంపల్లి, కురుమల, మసకవంకపల్లి గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రానికి తరలివచ్చి తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అభ్యర్థులు, వారి మద్దతుదారుల రాకతో నామినేషన్ కేంద్రం వద్ద ఎన్నికల సందడి నెలకొంది.

– దొన్నికోటలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు

దొన్నికోట గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా యనమల చంద్రకళ (పెద్దప్పయ్య నాయుడు భార్య) నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున యనమల తిమ్మమ్మ (హరినాయుడు భార్య) సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీకి సిద్ధమవడంతో దొన్నికోట గ్రామంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.

– పులగంపల్లి సర్పంచ్ బరిలో బి. నిర్మల

పులగంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బి. నిర్మల (రమేష్ భార్య) తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అదేవిధంగా కురుమల, మసకవంకపల్లి గ్రామాల నుంచి కూడా సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించేందుకు కేంద్రానికి తరలివచ్చారు. దీంతో నాలుగు గ్రామపంచాయతీల పరిధిలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

– సర్పంచ్ స్థానాలకు 9 మంది.. వార్డు సభ్యుల స్థానాలకు 38 మంది

దొన్నికోట నామినేషన్ కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీలకు సంబంధించి మొత్తం 9 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో తెలుగుదేశం పార్టీ నుంచి ఐదుగురు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు ఉన్నారు. అదేవిధంగా వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 38 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. వీరిలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికల బరిలోకి దిగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

– పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. అభ్యర్థులు, వారి మద్దతుదారులు క్రమశిక్షణతో వ్యవహరించేలా తగిన భద్రతా చర్యలు తీసుకున్నారు.

పోలీసుల పర్యవేక్షణ మధ్య గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.

మొత్తంగా నల్లమాడ మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్లతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతుండటంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. రానున్న రోజుల్లో అభ్యర్థుల ప్రచారం, ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు, పార్టీల వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయన్న ఆసక్తి గ్రామస్థుల్లో నెలకొంది.

ఎవరికీ తగ్గని బలం.. లాటరీతో తేలిన బలాబలాలు.. ఓబులదేవరచెరువులో ఆసక్తికర రాజకీయం!

చెరో 7 ఎంపీటీసీలతో సమబలంగా నిలిచిన ఇరు పార్టీలు.. ఉత్కంఠకు తెరదించిన లాటరీ

- ఎంపీపీగా పిట్టా ఓబుల్ రెడ్డి.. వైస్ ఎంపీపీగా కోటపల్లి హరిత ఎన్నిక

ఓబులదేవరచెరువు, నవంబర్ 19 ((విజన్ ఆంధ్ర))
శ్రీ సత్యసాయి జిల్లా ఓబులదేవరచెరువు మండల పరిషత్ రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి. మండల పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు చెరో ఏడుగురు ఎంపీటీసీల బలంతో సమాన స్థాయిలో నిలవడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవుల ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఇరు పార్టీలకు సమాన బలం ఉండటంతో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో ఎంపీపీ పదవి తెలుగుదేశం పార్టీకి, వైస్ ఎంపీపీ పదవి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కాయి.

ఎంపీపీ పదవికి నిర్వహించిన లాటరీలో టీడీపీ అభ్యర్థి పిట్టా ఓబుల్ రెడ్డి విజయం సాధించారు. దీంతో ఓబులదేవరచెరువు మండల పరిషత్ అధ్యక్షుడిగా ఆయన ఎన్నికయ్యారు.



అదేవిధంగా వైస్ ఎంపీపీ పదవికి నిర్వహించిన లాటరీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోటపల్లి హరిత విజయం సాధించారు. దీంతో ఆమె వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు.

– సమబలంతో ఉత్కంఠ.. లాటరీతో ఫలితం

మండల పరిషత్‌లో ఇరు పార్టీలకు చెరో ఏడుగురు ఎంపీటీసీలు ఉండటంతో ఎవరి ఖాతాలో ఎంపీపీ పీఠం చేరుతుందనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. సాధారణ ఎన్నికల ప్రక్రియలో ఇరు పార్టీలకు సమాన బలం ఉండటంతో చివరకు లాటరీ విధానం ద్వారా పదవులను కేటాయించారు. ఈ ప్రక్రియలో టీడీపీకి ఎంపీపీ, వైసీపీకి వైస్ ఎంపీపీ పదవులు దక్కాయి. దీంతో ఇరు పార్టీలకు మండల పరిషత్‌లో ప్రాతినిధ్యం లభించినట్లయింది.

– అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి.. ఎంపీ పార్థసారథి

ఈ కార్యక్రమానికి హాజరైన హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ మండల పరిషత్ ఎన్నికల ప్రక్రియ, మండల అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. మండల పరిధిలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

మొత్తంగా ఓబులదేవరచెరువు మండల పరిషత్ ఎన్నికల్లో సమాన బలంతో సాగిన రాజకీయ పోరుకు లాటరీతో తెరపడింది. ఎంపీపీ పీఠం టీడీపీకి, వైస్ ఎంపీపీ పదవి వైసీపీకి దక్కడంతో మండల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.


తనకల్లు మండల ఎంపీపీగా బచ్చిలి రామాదేవి



తనకల్లు, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) విలేకరి)
శ్రీ సత్యసాయి జిల్లా, తనకల్లు మండలంలోని మల్లిరెడ్డిపల్లి పంచాయతీ పెద్దపల్లికి చెందిన బచ్చిలి రామాదేవి ని తనకల్లు మండల ఎంపీపీగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది.

ఈ సందర్భంగా నూతన ఎంపీపీ బచ్చిలి రామాదేవి ని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అభినందనలు తెలియజేస్తూ, మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

గాండ్లపెంట మండల ఎంపీపీగా బి. అంజనమ్మ ఎన్నిక



గాండ్లపెంట, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)
శ్రీ సత్యసాయి జిల్లా,కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండల నూతన ఎంపీపీగా బి. అంజనమ్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ బి. అంజనమ్మ కు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ నాయకత్వంలో మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

తలుపుల మండల పరిషత్ పీఠంపై మెడ రెడ్డమ్మ..

వైస్ ఎంపీపీగా నీలపు లక్ష్మి ప్రసన్న

రాజకీయ చాణక్యత ప్రదర్శించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



తలుపుల, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)
శ్రీ సత్యసాయి జిల్లా,కదిరి నియోజకవర్గం,తలుపుల మండల పరిషత్ రాజకీయాల్లో గత కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. మండల పరిషత్ అధ్యక్షురాలిగా మెడ రెడ్డమ్మ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షురాలిగా బత్రేపల్లి ఎంపీటీసీ సభ్యురాలు నీలపు లక్ష్మి ప్రసన్న ఎంపికయ్యారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎంపిక విషయంలో కీలకంగా వ్యవహరించిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తన రాజకీయ చాణక్యతను ప్రదర్శిస్తూ, పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రాజకీయ వ్యూహాలు, సమన్వయంతో మండల పరిషత్ పీఠాల ఎంపిక ప్రక్రియ సజావుగా పూర్తయింది. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ మెడ రెడ్డమ్మ కు , వైస్ ఎంపీపీ నీలపు లక్ష్మి ప్రసన్న కు అభినందనలు తెలియజేస్తూ, తలుపుల మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.

నల్లమాడ ఎంపీపీ పీఠం వైసీపీదే.. రెండు కీలక పదవుల్లోనూ మహిళలకే పట్టం!

- మండల పరిషత్ పీఠాన్ని దక్కించుకున్న వైసీపీ.. ఎంపీపీగా శ్రీశైలం నవ్యశ్రీ, వైస్ ఎంపీపీగా కె. శ్రావణి ఎన్నిక

- దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్సీపీకి మరో విజయం.. పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు



నల్లమాడ, నవంబర్ 19 ((విజన్ ఆంధ్ర) విలేకరి)
నల్లమాడ మండల పరిషత్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ), ఉపాధ్యక్షురాలు (వైస్ ఎంపీపీ) పదవులను వైఎస్సార్సీపీ కైవసం చేసుకుంది. నల్లమాడ-2 ఎంపీటీసీ సభ్యురాలు శ్రీశైలం నవ్యశ్రీ మండల పరిషత్ అధ్యక్షురాలిగా, రెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కె. శ్రావణి ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుల మద్దతుతో ఈ రెండు కీలక పదవులు వైఎస్సార్సీపీ ఖాతాలో చేరాయి. దీంతో మండల పరిషత్‌లో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.మండల పరిషత్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్సీపీ ఎంపీటీసీ సభ్యులు సమష్టిగా వ్యవహరించి ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు తమ అభ్యర్థులను ఎన్నుకున్నారు. నల్లమాడ మండల రాజకీయాల్లో కీలకమైన ఈ రెండు పదవులను దక్కించుకోవడం పార్టీకి ప్రాధాన్యత సంతరించుకుంది. నూతనంగా ఎన్నికైన ఇద్దరు మహిళా ప్రజాప్రతినిధులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

– ఎనిమిది మంది ఎంపీటీసీల మద్దతు

నల్లమాడ మండల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. చారుపల్లి నుంచి కె. జయమ్మ, దొన్నికోట నుంచి కె. రమేష్, నల్లమాడ-2 నుంచి ఎస్. నవ్యశ్రీ, నల్లమాడ-3 నుంచి కె. మహేష్ నాయక్, పాత బత్తలపల్లి నుంచి చిల్లా ఇందిరమ్మ, పులగంపల్లి నుంచి షేక్ పర్వీన్, రెడ్డిపల్లి నుంచి కె. శ్రావణి, వెల్లమద్ది నుంచి కె. అరుణ బాయి ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నారు. వీరి మద్దతుతో శ్రీశైలం నవ్యశ్రీ, కె. శ్రావణి ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికయ్యారు.

– దుద్దుకుంట నాయకత్వంలో పార్టీకి బలం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో, పుట్టపర్తి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నాయకత్వం, సహకారంతో ఈ ఎన్నిక జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు స్థానిక సంస్థల్లో పార్టీ ప్రాతినిధ్యాన్ని కొనసాగించేందుకు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కృషి చేస్తున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వం, మార్గదర్శకత్వంలో నల్లమాడ మండల పరిషత్‌లో రెండు కీలక పదవులను పార్టీ దక్కించుకోవడం పట్ల కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

నూతనంగా ఎన్నికైన ఎంపీపీ శ్రీశైలం నవ్యశ్రీ, వైస్ ఎంపీపీ కె. శ్రావణితో పాటు ఎంపీటీసీ సభ్యులకు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ అభినందనలు తెలిపారు. నల్లమాడ మండల పరిషత్‌లో వైఎస్సార్సీపీ రెండు కీలక పదవులను కైవసం చేసుకోవడంతో మండల రాజకీయాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.

మంగళగిరి

టిడ్కో ఇళ్లలో నీటి గోస...

- 36వ డివిజన్ వైఎస్సార్సీపీ అభ్యర్థి కుంచాల శివపార్వతి ఎదుట స్థానిక మహిళల ఆవేదన



మంగళగిరి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

మంగళగిరిలోని టిడ్కో హౌసెన్‌లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని, సమస్యను పట్టించుకునే వారు లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 36వ డివిజన్ వైఎస్సార్సీపీ అభ్యర్థి కుంచాల శివపార్వతి టిడ్కో సముదాయానికి వెళ్లిన సందర్భంగా, స్థానిక మహిళలు ఆమె ఎదుట తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తాగునీరు, బాత్‌రూమ్‌ల అవసరాలకు సైతం నీళ్లు దొరకని పరిస్థితి ఉందని మహిళలు వాపోయారు. నీటి ట్యాంకులను శుభ్రం చేసే వారు, కడిగించే వారు ఎవరూ లేరని, తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన చెందారు. రెండు, ఐదు రోజుల పాటు నీళ్లు రాని సందర్భాలు ఉన్నాయని, నీళ్లు మోసుకోలేక భుజాలు నొప్పులు పుడుతున్నాయని మహిళలు తెలిపారు. తమ కష్టాలేమిటని అడిగేవారే లేరని, కనీసం ఒక బోరు వేసినా తమ అవసరాలకు వాడుకుంటామని పేర్కొన్నారు. గతంలోనూ నీటి సమస్యతో తాము పడిన ఇబ్బందులు తమకే తెలుసని, అయితే సమస్య వచ్చినప్పుడు కేవలం మాటలు చెప్పడం వరకే కాకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని కోరారు.ఫ్లోర్‌కు ఒక పంపు ఏర్పాటు చేసే అంశంపైనా, ఇతరులు అడ్డుపడుతున్న తీరుపైనా మహిళలు ప్రస్తావించారు.తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని 36వ డివిజన్ అభ్యర్థి కుంచాల శివపార్వతికి స్థానిక మహిళలు విజ్ఞప్తి చేశారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం :

జీజీహెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్.





గుంటూరు, నవంబర్ 19. (విజన్ ఆంధ్ర)

"పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు. ప్రతి విభాగంలో పటిష్టమైన వైద్య సేవలు అందాలి. ఆస్పత్రికి వచ్చే పేద రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను ఎమ్మెల్యే నసీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిటీ స్కాన్, ఎంఆర్ఐ, పెట్ స్కాన్, చిన్న పిల్లల వార్డు, జనరల్ వార్డు, ఆర్థోపెడిక్, మాతాశిశు సంరక్షణ విభాగాలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులతో మాట్లాడి, వైద్య సేవలు ఎలా ఉన్నాయని విచారించారు. కొన్ని విభాగాల్లో సిబ్బంది సరిగా సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులను పిలిచి మాట్లాడారు. రోగులకు సక్రమమైన సేవలు అందించాలని సూచించారు. ఓపీ విభాగంలో సాధ్యమైన వేగవంతంగా సేవలు అందించాలని చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.100 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆస్పత్రిలో అన్ని విభాగాలను బలోపేతం చేశామని చెప్పారు. క్యాన్సర్ విభాగంలో రూ.25 వేలు విలువైన పెట్ స్కాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మరో వైపు ఎంఆర్ఐ స్కాన్ తోపాటు ఈఎన్టీ విభాగాల్లో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికే ప్రభుత్వ వైద్యశాల అపర సంజీవనిగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మందులకు కొరత లేదని చెప్పారు. వైద్యులు రోగాన్ని బట్టి ఏవైనా నూతన మందులు ప్రిస్క్రిప్షన్ ఇస్తే వాటిని మరో పది రోజుల్లో తెప్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు పది జిల్లాల నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలను వస్తుంటారని, వారికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రిలో చిన్న చిన్న లోపాలు ఉంటే తమ దృష్టికి ఎప్పుడైనా తీసుకురావచ్చని, వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరిలో రాయల్ పార్క్ అపార్ట్‌మెంట్‌లో అగ్నికీలలు..

గ్యాస్ లీకేజీతో ఐదో అంతస్తులో భారీ మంటలు..క్షణాల్లో బూడిదైన ఫర్నిచర్! తృటిలో తప్పిన పెను ప్రమాదం



మంగళగిరి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రి వెనుక ఉన్న రాయల్ పార్క్ అపార్ట్‌మెంట్‌లో గ్యాస్ లీకేజీ తీవ్ర కలకలం రేపింది. ఐదో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఫ్లాట్‌లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

అత్యవసర వైద్యం, అధునాతన కిడ్నీ చికిత్సలతో మెరుగైన ఫలితాలు

- గుండెపోటు, పక్షవాతం, ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ కీలకం
- కిడ్నీ వ్యాధులను ముందుగా గుర్తిస్తే వైఫల్యాన్ని నివారించవచ్చు



గుంటూరు, నవంబరు 19 (విజన్ ఆంధ్ర)

అత్యవసర వైద్య పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, అదేవిధంగా కిడ్నీ సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి ఆధునిక చికిత్సలు అందిస్తే మూత్రపిండాల వైఫల్యాన్ని నివారించే అవకాశం ఉంటుందని యశోదా హాస్పిటల్స్ మలక్‌పేట్ యూనిట్‌కు చెందిన వైద్య నిపుణులు తెలిపారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, రోడ్డు ప్రమాదాలు, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు వంటి అత్యవసర పరిస్థితులతో పాటు కిడ్నీ వ్యాధులు, డయాలసిస్, కిడ్నీ మార్పిడి చికిత్సలపై గురువారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో యశోదా హాస్పిటల్స్ మలక్‌పేట్ యూనిట్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సీనియర్ కన్సల్టెంట్, విభాగాధిపతి డాక్టర్ ఎస్. కలాధర్, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ టి. సూర్య ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో తొలి గంటను గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారని డాక్టర్ ఎస్. కలాధర్ తెలిపారు. గుండెపోటు, పక్షవాతం, రోడ్డు ప్రమాదాలు, తీవ్రమైన గాయాలు, శ్వాసకోశ సమస్యలు వంటి సందర్భాల్లో రోగికి వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం ఎంతో ముఖ్యమన్నారు. ఆసుపత్రికి చేరుకోవడంలో ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు..గుండెపోటు వచ్చినప్పుడు ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి, ఎడమ చేయి లేదా దవడకు నొప్పి వ్యాపించడం, విపరీతమైన చెమటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించవచ్చన్నారు. ఇలాంటి సందర్భాల్లో వెంటనే ఈసీజీ, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి, గుండె రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకిని తొలగించేందుకు తగిన చికిత్స ప్రారంభించాలని వివరించారు. అదేవిధంగా బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలైన ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి లేదా కాలు బలహీనపడటం, మాట తడబడటం, చూపు లేదా సమతుల్యతలో సమస్యలు రావడం వంటివి కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకూడదన్నారు. వేగవంతమైన నీటీ, ఎంఆర్ఐ పరీక్షల ద్వారా స్ట్రోక్ రకాన్ని గుర్తించి, అర్హత ఉన్న రోగులకు రక్తం గడ్డను కరిగించే మందులు లేదా మెకానికల్ థ్రాంబెక్టమీ వంటి ఆధునిక చికిత్సలు అందించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో తల, వెన్నెముక, ఛాతీ, పొత్తికడుపు భాగాలకు తీవ్రమైన గాయాలు కావచ్చని, అధిక రక్తస్రావాన్ని నియంత్రించడం, శ్వాస మార్గాన్ని సురక్షితంగా ఉంచడం, రక్తప్రసరణను స్థిరీకరించడం వంటి చర్యలు అత్యంత ముఖ్యమని చెప్పారు. ప్రస్తుతం అత్యవసర వైద్యంలో పోర్టబుల్ అల్ట్రాసౌండ్ (పీఓసీయూ), అధునాతన రోగి పర్యవేక్షణ వ్యవస్థలు, వెంటిలేటరీ సపోర్ట్, ఐసీయూ, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్) వంటి ఆధునిక విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. తీవ్రమైన ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే సెప్సిస్, శ్వాసకోశ వైఫల్యం వంటి పరిస్థితుల్లోనూ వేగంగా నిర్ధారణ చేసి చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చన్నారు.

కిడ్నీ వ్యాధులను ముందుగానే గుర్తించాలి డాక్టర్ టి. సూర్య ప్రకాష్

మధుమేహం, అధిక రక్తపోటు, జీవనశైలి మార్పుల కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని డాక్టర్ టి. సూర్య ప్రకాష్ తెలిపారు. ప్రారంభ దశలో కిడ్నీ వ్యాధులకు స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని, వ్యాధి ముదిరిన తర్వాతే చాలామందికి విషయం తెలుస్తోందన్నారు..మధుమేహం, రక్తపోటు ఉన్నవారు క్రమం తప్పకుండా సీరం క్రియాటినిన్, వ+ళీ=, యూరిన్ ఆల్బుమిన్-క్రియాటినిన్ రేషియో (ళూఆజ=) పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాళ్ల వాపు, మూత్రంలో మార్పులు, ఆకలి తగ్గడం, అధిక అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. క్రానిక్ కిడ్నీ డిసీజ్ చికిత్సలో ప్రస్తుతం ఎ+ఎ2 ఇన్హిబిటర్లు, ఫినెరెనోన్ వంటి ఆధునిక మందులు కొన్ని రకాల రోగులకు ప్రయోజనకరంగా ఉంటున్నాయని వివరించారు. రోగి కిడ్నీ పనితీరు, మధుమేహం, రక్తపోటు, ఇతర ఆరోగ్య పరిస్థితులను బట్టి చికిత్సను నిర్ణయిస్తామని చెప్పారు. కిడ్నీ వ్యాధులను నివారించేందుకు మధుమేహం, రక్తపోటు నియంత్రణ, ఆరోగ్యకరమైన ఆహారం, తగిన శారీరక శ్రమ, వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని డాక్టర్ సూర్య ప్రకాష్ తెలిపారు. అత్యవసర వైద్యంలో సమయం, వేగవంతమైన రోగ నిర్ధారణ, సరైన చికిత్స ఎంతో ముఖ్యం. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, రోడ్డు ప్రమాదాలు వంటి పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకమవుతుంది. అదేవిధంగా కిడ్నీ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి ఆధునిక చికిత్సలు అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో నిపుణుల వైద్య సలహా తీసుకోవాలి" అని డాక్టర్లు సూచించారు.

37వ డివిజన్‌లో మాచర్ల నిర్మల ప్రచార జోరు.. కూటమి విజయమే లక్ష్యంగా ముందడుగు!



మంగళగిరి నవంబర్ 19(విజన్ ఆంధ్ర)

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్‌లో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాచర్ల నిర్మల ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజా సంక్షేమం కోసం కూటమి చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. 37వ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తనకు అవకాశం కల్పించాలని మాచర్ల నిర్మల ప్రజలను అభ్యర్థించారు.
ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు, జనసేన నాయకుడు జంజనం సాంబశివరావు, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త నందమోహన్ రావు, వీర మహిళలు చెన్నకేశవ, శాంతి ప్రియ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహంతో 37వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం సందడిగా సాగింది.

బాలబాలికల సంరక్షణ, భద్రత అందరి బాధ్యత

పారా లీగల్ వాలంటీర్ ఆర్. శ్రీనివాసరావు



రేపల్లె, నవంబర్ 19(విజన్ ఆంధ్ర)

బాల బాలికల సంరక్షణ, భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని రేపల్లె మండల న్యాయ సేవాధికార కమిటీ పారా లీగల్ వాలంటీర్ ఆర్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం రేపల్లె పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. సుందర రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్లు శ్రీనివాసరావు, తాహిర్ అహ్మద్ మాట్లాడుతూ బాలల భద్రత, భవిష్యత్తు సంక్షేమం, వారి హక్కులు మరియు సంబంధిత చట్టాలపై విద్యార్థులకు విపులంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోక్సో చట్టం-2012 అమలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, బాలల హక్కుల పరిరక్షణ చట్టాల గురించి వివరించారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. విద్యార్థులు కేవలం చదువునే లక్ష్యంగా చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, అపరిచిత వ్యక్తుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని హితవు పలికారు. గంజాయి, సిగరెట్, పాన్ పరాగ్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిహెచ్. సుందర రావు, ఉపాధ్యాయులు జానీ, షాహిద్ బేగ్, రామాంజనేయులు, కుసుమకుమారి, శాంతిలత, నాగమణి, డి.వి.ఆర్ తదితరులు మరియు సుమారు 280 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి.. డ్రైనేజీలు శుభ్రం చేయండి!



తెనాలి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

రహదారులపై ఆక్రమణలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వైవీఆర్ కాలనీలో సెక్షన్ హెడ్‌లు, మొదటి వార్డు ప్రజాప్రతినిధితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాలనీలో రహదారులను పరిశీలించి, ఆక్రమణలను గుర్తించారు. వాటిని తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారికి సూచించారు.అలాగే డ్రైనేజీల్లో పూడిక, చెత్త పేరుకుపోకుండా వెంటనే శుభ్రం చేయాలని పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు. మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలన్నారు. కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి సత్వర పరిష్కారం చూపించడమే లక్ష్యమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు.

35 ఏళ్ల అక్షర ప్రస్థానానికి ఐదో రికార్డు

- దార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హకీం జానికి చోటు



తెనాలి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

మూడు దశాబ్దాలకు పైగా సాగిన అక్షర ప్రయాణం.. వేలాది వ్యాసాలతో పాఠకులకు చేరువైన కలం.. ఇప్పుడు మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది.తెనాలికి చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జాని పేరు తాజాగా దార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. 35 ఏళ్లుగా తెలుగు పత్రికా రంగానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది.హకీం జాని 1991 నుంచి తెలుగు దిన, వార, మాస పత్రికలతోపాటు ఆదివారం అనుబంధాలకు వివిధ అంశాలపై వ్యాసాలు రాస్తున్నారు. ఇప్పటివరకు ఆయన రచించిన 1,630 వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.వీటిలో వెయ్యికి పైగా వ్యాసాలు రంగుల పేజీల్లో ముద్రితమయ్యాయి. పలు దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో 75కు పైగా వ్యాసాలు ముఖచిత్ర కథనాలుగా ప్రచురితం కావడం విశేషం. అన్ని రచనలు షేక్ అబ్దుల్ హకీం జాని పేరుతోనే ప్రచురితమయ్యాయి.ఈ వివరాలను పరిశీలించిన హైదరాబాద్‌కు చెందిన దార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు ఆయన పేరును రికార్డుల్లో నమోదు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ దార్ల నాగేశ్వరరావు, డైరెక్టర్ శ్రావణ్ దార్ల పంపిన ధ్రువపత్రాన్ని గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ చేతుల మీదుగా హకీం జాని అందుకున్నారు.ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా హకీం జాని చేస్తున్న నిరంతర కృషి అభినందనీయమన్నారు. విభిన్న అంశాలపై రచనలు చేస్తూ పత్రికా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం గొప్ప విషయమని ప్రశంసించారు. అనంతరం ఆయనను దుశ్శాలువతో సత్కరించారు.హకీం జాని గతంలోనూ పలు రికార్డుల్లో స్థానం సంపాదించారు. 2013లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 2021లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, 2023లో ఆసియా వరల్డ్ రికార్డ్స్, 2026లో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. తాజాగా దార్ల బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించడంతో ఐదోసారి రికార్డు గుర్తింపును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, పాత్రికేయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు గ్యాస్ సిలిండర్...

- మేయర్ అభ్యర్థి కేతావత్ చందు నాయక్...

- నాలుగు డివిజన్లో పోటీలో ఉన్న కార్పొరేటర్ల గెలిపించాలి...

మంగళగిరి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)



మంగళగిరి,తాడేపల్లి నగర పాలక ఎన్నికలు ఈనెల 26వ తేదీన జరగనున్నాయి. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫునమేయర్ అభ్యర్థిగాపోటీలో ఉన్నకేతావత్ చందు నాయక్ బ్యాలెట్ పత్రాలలో 4 వనంబర్ 12 వ డివిజన్ అభ్యర్థి షేక్ వహీదున్నిసా సీరియల్ నంబరు 3 కేటాయించినట్లు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ తెలిపారు. మా పార్టీ అభ్యర్థులకు గ్యాస్ సిలిండర్ కేటాయించారని ఈ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని జలీల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాపార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ అభివృద్ధిలోకీలక పాత్ర పోషిస్తారని వారిని ఆశీర్వదించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుండిమెడలో కూటమి అభ్యర్థి రాంబాబుకు ప్రజల బ్రహ్మరథం

- మూడో వార్డులో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం: కొమ్మారెడ్డి కిరణ్

మంగళగిరి నవంబర్ 19(విజన్ ఆంధ్ర)

మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా మూడో వార్డు (గుండిమెడవడ్డేశ్వరం) టీడీపీ అభ్యర్థి నాంతోటి రాంబాబు విజయాన్ని కాంక్షిస్తూ గుండిమెడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ (నాని) తెలిపారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలో గుండిమెడకు సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ఎస్టీ కమ్యూనిటీ హాల్‌కు రూ.1.20 కోట్లు, శ్మశానవాటిక అభివృద్ధికి రూ.కోటి, కరకట్ట రహదారికి రూ.1.30 కోట్లు, రైతుల రహదారికి రూ.1.50 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మూడో వార్డులో నాంతోటి రాంబాబును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండిమెడ రమేష్ బాబు, చిగురుపాటి సుబ్బారావు, ఈపూరి బాబు, జెట్టి రమేష్, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, గార్లపాటి ప్రసాద్, అనుమోలు సాంబశివరావు, కాసరనేని అంకినీడు, అనుమోలు వెంకయ్య, ద్రోణవల్లి కోటేశ్వరరావు, దాసరి సీతయ్య, మట్టిపల్లి వెంకటేష్, తురక ముసలయ్య, కారుమంచి వెంకటేష్, భక్తుల నాని, మిద్దె వెంకట్రావు, జెట్టు దిబ్బయ్య, జెట్టి నాగులు, దాసరి నరేష్, జెట్టి సుధాకర్, జెట్టి కోటేశ్వరరావు, కొచ్చర్ల సుబ్బారావు, గుడిమెట్ల నాగరాజు, గుడిసె సాంబయ్య, మందపాటి బాబురావు, కోపల్లె జోజి, గుండిమెడ చిన్నబాబు, మల్లవరపు సురేష్, గుండిమెడ కిషోర్, సుద్దపల్లి అచ్చేశ్వరరావు, శ్యాంబాబు, పాములు, బుల్లా సంతోష్, వల్లభాపురం జిన్ని, పాలకుర్తి శ్రీనివాస్, కోసూరు



గోపి, రాజేష్, మెరుగుమల్ల సాంబశివరావు, సింహాద్రి శీను, వాసు, ఉయ్యూరు సీతారామయ్య తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



కొత్తచెర్వు,నవంబర్ 19,(విజన్ ఆంధ్ర)

గురువారం కొత్తచెర్వు జెడ్పిహెచ్ పాఠశాల బాలురు లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప, అసిస్టెంట్ కమిషన్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ లాజరు మరియు ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఓపెన్ స్కూల్ విద్యావిధానం యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. చదువు మధ్యలో మానేసిన (డ్రాప్-అవుట్) విద్యార్థులకు మరియు వివిధ కారణాల వల్ల విద్యను కొనసాగించలేకపోయిన అర్హులైన వారికి దీనిపై సరైన అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లాలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో తప్పిన విద్యార్థులతో పాటు, అంగన్వాడి వర్కర్లు, హోంగార్డ్స్, ఆశా వర్కర్లు, మహిళా సంఘ సభ్యులు మరియు చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలియజేశారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (SHGs), మెప్మా, ఐసిడిఎస్,వైద్య ఆరోగ్య శాఖ, డ్వాక్రా, డ్వామా మొదలగు అన్ని శాఖలలో పనిచేస్తూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు కాని వారందరూ ఓపెన్ స్కూల్ విద్యావిధానం ద్వారా తమ విద్యార్హతలను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీల జోరు.. అభ్యర్థుల హోరు.. పోలీసు బందోబస్తు మధ్య దొన్నికోటలో ప్రశాంతంగా నామినేషన్లు!



- నాలుగు పంచాయతీలు.. 47 మంది అభ్యర్థులు..

దొన్నికోట కేంద్రంగా ఎన్నికల సందడి

- టీడీపీ నుంచి ఐదుగురు.. వైసీపీ నుంచి ఇద్దరు..

బీజేపీ నుంచి ఒకరు.. స్వతంత్రంగా మరొకరు పోటీ

నల్లమాడ, నవంబర్ 19 -(విజన్ ఆంధ్ర)

నల్లమాడ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మండలంలోని నాలుగో నామినేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన దొన్నికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. దొన్నికోటతో పాటు పులగంపల్లి, కురుమల, మసకవంకపల్లి గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ కేంద్రానికి తరలివచ్చి తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అభ్యర్థులు, వారి మద్దతుదారుల రాకతో నామినేషన్ కేంద్రం వద్ద ఎన్నికల సందడి నెలకొంది.

– దొన్నికోటలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు

దొన్నికోట గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా యనమల చంద్రకళ (పెద్దప్పయ్య నాయుడు భార్య) నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున యనమల తిమ్మమ్మ (హరినాయుడు భార్య) సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీకి సిద్ధమవడంతో దొన్నికోట గ్రామంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.

– పులగంపల్లి సర్పంచ్ బరిలో బి. నిర్మల

పులగంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బి. నిర్మల (రమేష్ భార్య) తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అదేవిధంగా కురుమల, మసకవంకపల్లి గ్రామాల నుంచి కూడా సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించేందుకు కేంద్రానికి తరలివచ్చారు. దీంతో నాలుగు గ్రామపంచాయతీల పరిధిలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

– సర్పంచ్ స్థానాలకు 9 మంది.. వార్డు సభ్యుల స్థానాలకు 38 మంది

దొన్నికోట నామినేషన్ కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీలకు సంబంధించి మొత్తం 9 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో తెలుగుదేశం పార్టీ నుంచి ఐదుగురు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు ఉన్నారు. అదేవిధంగా వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 38 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. వీరిలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికల బరిలోకి దిగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

– పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు. అభ్యర్థులు, వారి మద్దతుదారులు క్రమశిక్షణతో వ్యవహరించేలా తగిన భద్రతా చర్యలు తీసుకున్నారు.

పోలీసుల పర్యవేక్షణ మధ్య గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.

మొత్తంగా నల్లమాడ మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్లతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతుండటంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. రానున్న రోజుల్లో అభ్యర్థుల ప్రచారం, ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు, పార్టీల వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయన్న ఆసక్తి గ్రామస్థుల్లో నెలకొంది.

జర్నలిస్టుల హ్యాండ్ బుక్‌తో విలువలు కలిగిన జర్నలిజానికి ప్రోత్సాహం..

మీడియా మిత్రులకు పుస్తకాల పంపిణీ



మంగళగిరి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

25 ఏళ్ళ జర్నలిజం అనుభవంలో ఎన్నో కష్టాలు,ఇబ్బందులు ఎదుర్కొని మీడియా రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం గత సోమవారం జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని ఆవిష్కరించిన జర్నలిజం-జర్నలిస్టులు (జర్నలిస్టుల హ్యాండ్ బుక్)మూడవభాగం మంగళగిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాక్షేత్రంలోకి తీసుకురావడం చాలా ఆనందంగా..,గౌరవంగా.., ప్రెస్ క్లబ్ కు ఎంతో గర్వకారణంగా ఉందని,సీనియర్ జర్నలిస్ట్, మంగళగిరిప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బండెల దయాకర్ అన్నారు. గురువారం మంగళగిరి ప్రెస్ క్లబ్ లో జర్నలిజం-జర్నలిస్టులు (జర్నలిస్టుల హ్యాండ్ బుక్)మూడవభాగం "రాజారత్నం ట్రస్ట్"జర్నలిస్టులకు పుస్తకం ఉచితంగా పంపిణీ చేసిన కార్యక్రమంలో పాల్గొని దయాకర్ మాట్లాడారు.రాజారత్నం ఇప్పటికే జర్నలిజం-జర్నలిస్టులు పేరుతో రెండు పుస్తకాలు రాసారని,ఇది మూడవ పుస్తకం అని దయాకర్ అన్నారు.2023లో రాసిన మొదటిభాగం పుస్తకం మీడియా విమర్శకుల ప్రశంసలు పొందగా,రెండవభాగం జర్నలిజం పై ఆశక్తి ఉన్నవారికి బేసిక్స్ అందించగా,ఈ మూడవ భాగం హ్యాండ్ బుక్ జర్నలిస్టులకు మరింత ఉపయోగకరమైన అంశాలు ఉన్నాయని నూతన జర్నలిస్టులు,జర్నలిజం విద్యార్థులు తప్పనిసరిగా చేతిలో ఉంచుకోవాల్సిన హ్యాండ్ బుక్ అని అన్నారు.ఈ సందర్భంగా జరిగిన పుస్తక పంపిణీ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బత్తుల సాంబశివరావు,సీనియర్ జర్నలిస్ట్ బాపనపల్లి శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు ఎస్.కె సుభాని,జాయింట్ సెక్రెటరీ మెడకాయల మస్తాన్ రావు, ప్రెస్ క్లబ్ ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొని రచయిత రాజారత్నం చేతుల మీదుగా పుస్తకాలు అందుకున్నారు. జర్నలిస్టులుగౌరవంగా ఈపూరి రాజారత్నం ని సత్కరించారు.

బేతపూడి, గుడికాయలంక గ్రామాల్లో

'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

నిర్ణీత గడువులోగా రబీ పంటల బీమా చేసుకోవాలి



రేపల్లె, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

వాతావరణ మార్పులు, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు పంటల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) మహేష్ బాబు సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బేతపూడి, గుడికాయలంక గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాలను పరిశీలించిన ఏవో మహేష్ బాబు రైతులతో మాట్లాడుతూ, 'ఆక్వాస్' తుఫాను ప్రభావంతో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి పంటలు దెబ్బతినకుండా మురుగు కాలువల ద్వారా ఎప్పటికప్పుడు నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎరువుల పంపిణీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన 'ఎఫ్ఎఫ్ఎస్' విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ స్మార్ట్‌ఫోన్లలో ప్లే స్టోర్ నుంచి ఖీఖీూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, క్యూఆర్ (ూ=) కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్థానిక ఎరువుల డీలర్లను ఎంపిక చేసుకుని సులభంగా ఎరువులు బుక్ చేసుకోవచ్చని వివరించారు. అలాగే యాప్‌లో భూమి వివరాలను జోడించే (ల్యాండ్ యాడింగ్) ప్రక్రియను గ్రామ వ్యవసాయ అధికారుల సహాయంతో పూర్తి చేసుకోవాలని తెలిపారు.రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి పంటల బీమా నమోదుపై మాట్లాడుతూ మినుము, పెసర, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేసే రైతులు డిసెంబర్ 15వ తేదీ లోపు, వరి సాగు చేసే రైతులు డిసెంబర్ 31వ తేదీ లోపు తప్పనిసరిగా బీమా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. బాపట్ల జిల్లా పరిధిలో ఆయా పంటలకు హెక్టారుకు వర్తించే బీమా మొత్తం, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను ఆయన వెల్లడించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులందరూ పంటలను కాపాడుకోవడంతో పాటు, గడువు ముగియకముందే బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాలకు ఈ నెల 28న బహిరంగ వేలం

తెనాలి, నవంబరు 19 (విజన్ ఆంధ్ర)

:పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలను అద్దెకు కేటాయించేందుకు ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో తన అధ్వర్యంలో లేదా అనుమతి పొందిన అధికారి ద్వారా వేలం ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు.డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాధవపెద్ది వెంకటరామయ్య, డాక్టర్ రావి రవీంద్రనాథ్, ఊరా ట్యాంకు (ఉత్తరం), కొత్తమాసు తులసీదాస్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లతో పాటు మహాత్మాగాంధీ, త్రిపురనేని రామస్వామి చౌదరి కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలకు వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10 వేల ధరావత్తు సొమ్ము, రూ.లక్ష సాల్వెన్సీ ధ్రువపత్రం, ఈసీ ధ్రువపత్రాలను ముందుగానే సమర్పించాలని సూచించారు. సాల్వెన్సీ ధ్రువపత్రం లేనివారు దానికి సమానమైన మొత్తాన్ని నగదు రూపంలో మున్సిపాలిటీలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.వేలం తేదీలో మార్పులు చేసే అధికారం తనకు ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. వేలానికి సంబంధించిన నిబంధనలు, ఇతర వివరాలను తెలుసుకోవాలనుకునే వారు మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగాన్ని కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు ముందుగానే అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుని వేలంలో పాల్గొనాలని కోరారు.

భూ అభ్యంతరాలపై తక్షణం చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

గుంటూరు నవంబరు 19 (విజన్ ఆంధ్ర)

భూ సమీకరణపై అందుతున్న అభ్యంతరాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సి.ఆర్.డి.ఏ రెండవ విడత భూ సమీకరణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిడమర్రు, నవులూరులో 22(ఏ) క్రింద ఉన్న అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి



అవగాహన కల్పించాలని సూచించారు. జలవనరులు గల ప్రదేశాలపై స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్ళాలని అన్నారు. రైల్వే లైన్ కు అవసరమగు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ, రైల్వే నుండి డ్రాయింగ్ లు రావలసి ఉందన్నారు. 1153 అభ్యంతరాలు మొత్తం అందాయన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, సి.ఆర్.డి.ఏ డిప్యూటీ కలెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఆర్ నివారణకు ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి : డి ఎం హెచ్ ఓ.

గుంటూరు నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పై ప్రజల్లో, వైద్య ఆరోగ్య సిబ్బందిలో అవగాహన కల్పించేందుకు నవంబరు 18, నుండి 24 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ యం. పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాలు, ఇతర సూక్ష్మజీవులు వాటిని నాశనం చేయడానికి లేదా వాటి పెరుగుదలను అరికట్టడానికి ఉపయోగించే మందులకు ప్రతిఘటన శక్తిని పొందడాన్ని యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్ అంటారన్నారు. ముఖ్యంగా యాంటీబయాటిక్స్‌ను అవసరం లేకుండా, సరైన మోతాదులో కాకుండా లేదా వైద్యుల సూచనలు లేకుండా వినియోగించడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ పెరిగి, సాధారణ ఇన్ఫెక్షన్లకు



కూడా చికిత్స కష్టతరమవుతుందని ఆమె తెలిపారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారుతోందని, దీనిని నివారించడానికి ప్రజలు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పశువైద్య రంగం మరియు సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేయడం అవసరమని డి ఎం హెచ్ ఓ తెలిపారు. యాంటీబయాటిక్స్ మనకు అమూల్యమైన ఔషధాలు. వాటిని బాధ్యతగా వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉండేలా కాపాడుకోవాలి. యాంటీబయాటిక్స్‌ను అవసరమైనప్పుడు మాత్రమే, వైద్యుల సూచన మేరకు వాడండి. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

మహిళా గ్రీవెన్స్ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి.



గుంటూరు, నవంబర్ 19. (విజన్ ఆంధ్ర)

మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి గురువారం అందుబాటులో ఉంటూ, మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం, శ్రీనివాసరావుపేటలో గురువారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎన్డీయే కూటమికి చెందిన నూతన మహిళా కార్పొరేటర్లతో కలిసి మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ప్రతి గురువారం నియోజకవర్గ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా, నిర్భయంగా వచ్చి చెప్పుకునేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తోందన్నారు. అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇటీవల ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన నూతన మహిళా కార్పొరేటర్ల సమక్షంలో ఈసారి గ్రీవెన్స్ నిర్వహించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. మహిళా కార్పొరేటర్లు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మౌలిక వసతుల సమస్యలు, అప్పులు ఇచ్చి మోసపోవడం, దొంగతనాలు, ఉద్యోగ అవకాశాలు, కుటుంబాల్లో వేధింపులు వంటి అనేక సమస్యలతో మహిళలు తమ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఇతరులతో చెప్పుకోలేని వ్యక్తిగత సమస్యలను సైతం మహిళలు ఇక్కడ ధైర్యంగా వెల్లడిస్తున్నారని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళలు సమస్యల రహితంగా, సంతోషంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ తమ కుటుంబాలతో ఆనందంగా జీవించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, స్ఫూర్తితో మహిళా సంక్షేమం, సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి గురువారం మహిళా గ్రీవెన్స్ కోసం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం అందుబాటులో ఉంటుందని, మహిళలు తమకు ఎదురయ్యే చిన్న సమస్యనైనా నిర్భయంగా వచ్చి తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు అండగా నిలిచిన నూతన మహిళా కార్పొరేటర్లు, కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

దీర్ఘకాలిక అతిథి అధ్యాపకులను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించాలి

-18 మంది అధ్యాపకుల వినతి.. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్‌పర్సన్, కార్యదర్శికి వినతిపత్రాలు

మంగళగిరి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 18 నుంచి 25 ఏళ్లుగా అతిథి అధ్యాపకులుగా సేవలందిస్తున్న 18 మంది సీనియర్ అధ్యాపకులను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా గుర్తించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య ఎస్. విజయభాస్కరరావుకు వినతిపత్రం సమర్పించారు. 2006, 2009 సంవత్సరాల్లో నియమితులైన తాము రెండు దశాబ్దాలుగా బోధన, పరీక్షల నిర్వహణ, పరిశోధన, ఇతర విశ్వవిద్యాలయ బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని తెలిపారు. తమ సుదీర్ఘ సేవలు, అర్హతలు, కుటుంబ బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత హోదాను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా మార్చి న్యాయం చేయాలని కోరారు.అనంతరం ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్‌పర్సన్ ఆచార్య కె. రత్న షీలామణి, కార్యదర్శి ఆచార్య బి. తిరుపతిరావులను కలిసి వినతిపత్రాలు అందజేసి, తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యక్షురాలు డాక్టర్ డి. జలజా కుమారి, కార్యదర్శి డాక్టర్ కె. మధుబాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. నాగరాజు, సహాయ కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ మంజుల, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ షర్మిల, డాక్టర్ ఉమా, డాక్టర్ కె. సునీత, డాక్టర్ విష్ణు, డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



మండలాల్లో కూటమి విజయ భేరి : మంత్రి అనగాని సత్యప్రసాద్.

- రేపల్లె నియోజకవర్గంలో ఘనంగా నూతన ఎంపీపీల ప్రమాణ స్వీకారోత్సవం

రేపల్లె, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

మండలాల్లో కూటమి ప్రభుత్వం విజయ భేరి మోగించింది అని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో నూతన మండల పరిషత్ అధ్యక్షుల (ఎంపీపీ) ప్రమాణ స్వీకార మహోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. చెరుకుపల్లి, నిజాంపట్నం, నగరం, రేపల్లె మండల కార్యాలయాల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చెరుకుపల్లి ఎంపీపీ బొర్రు రూపశ్రీ, నిజాంపట్నం ఎంపీపీ మోపిదేవి రాజీవ్, నగరం ఎంపీపీ మోర్ల స్వరూప, రేపల్లె ఎంపీపీ కొప్పనాతి రాజశేఖర్ లకు ఆయన హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి అనగాని మాట్లాడుతూ అధికారం అనేది ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశమని గుర్తుచేశారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రతి గ్రామానికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండాలని సూచించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని మండలాలను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ రావు, ఎన్నికల పరిశీలకురాలు అన్నాబత్తుని జయలక్ష్మి కూటమి నాయకులు కమతం సాంబశివరావు, చిలకలపూడి పాపారావు, ఏడుకొండలు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





ఖాళీ స్థలాల్లో పచ్చదనం పెంచాలి

తెనాలి నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకుంటూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు సూచించారు. వ్యర్థాల నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలనే లక్ష్యంతో డంపింగ్ యార్డులోనూ కూరగాయల సాగుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తెనాలి పురపాలక సంఘ కార్యాలయ పరిధిలోని డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన డంప్ సైట్‌లో దోసకాయ మొక్కలను పెంచి, పండిన కాయలను మున్సిపల్ సిబ్బందికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచడం వల్ల పరిసరాలు ఆహ్లాదకరంగా మారడంతో పాటు ప్రకృతితో అనుబంధం పెరుగుతుందన్నారు. మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా వాటిని నిరంతరం సంరక్షించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు సిబ్బంది, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. డంపింగ్ యార్డులో పండించిన దోసకాయలను సిబ్బందికి అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణంపై అవగాహన పెంచేందుకు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ ఏసుబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆజాదీ ఏజెంట్స్' ప్రచారాన్ని ప్రారంభించిన ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్

IndiaFirstLife
PROMOTED BY
బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda

విశాఖపట్నం, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర):

ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఇండియాఫస్ట్ లైఫ్) 'ఆజాది ఏజెంట్స్' అనే కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగాఇండియాఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్‌చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్‌సుమీత్ సాహ్నా మాట్లాడుతూఇది బీమా ఏజెంట్ల సహకారం మరియు కస్టమర్‌లు జీవిత ఆర్థిక మైలురాళ్లు మరియు అనిశ్చితిలో నావిగేట్ చేయడంలో వారు పోషించే పాత్రను జరుపుకుంటుందని తెలిపారు.ది వోంబ్ ద్వారా రూపొందించబడిన, ఈ ప్రచారం వృత్తి యొక్క తరచుగా విస్మరించే కోణంపై దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. కంపెనీ బ్రాండ్ వాగ్దానమైన "జిమ్మెదరియన్ హమ్సే బాంటియే, హల్కా లగేగా"లో రూట్ చేయబడిందని చెప్పారు.ఇన్సూరెన్స్ ఏజెంట్ యొక్క ప్రధాన పాత్ర ప్రజలకు అత్యంత ముఖ్యమైన వాటిని రక్షించడంలో మరియు జీవితపు మైలురాళ్ల కోసం సిద్ధం చేయడంలో సహాయపడుతుందన్నారు. కుటుంబాలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడానికి సహాయం చేయడం ద్వారా, వారు నిజంగా ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టడానికి అనుమతించే భద్రతా భావాన్ని సృష్టిస్తారని చెప్పారు. 'ఆజాదీ ఏజెంట్స్' ద్వారా, ఇండియా ఫస్ట్ లైఫ్ ఏజెంట్లను 'ఆజాదీ'ని ఎనేబుల్ చేసేవారిగా జరుపుకుంటుంది, వారు ప్రజల జీవితాల్లో సృష్టించే ప్రభావాన్ని గుర్తిస్తారు మరియు వృత్తిలో గొప్ప అహంకారాన్ని పెంపొందించారన్నారు.

ప్రతి పాలసీ వెనుక ఒక కుటుంబానికి భవిష్యత్తు కోసం మంచిగా ప్లాన్ చేసుకునేలా శక్తినిచ్చే సంభాషణ ఉంటుంది. ఇన్సూరెన్స్ ఏజెంట్లు జీవితంలోని కొన్ని ముఖ్యమైన నిర్ణయాల ద్వారా కస్టమర్‌లకు మద్దతు ఇస్తారు, వారు ముఖ్యమైన వాటిని రక్షించడంలో మరియు విశ్వాసంతో ముందుకు సాగడంలో సహాయపడతారని చెప్పారు.ఆజాది ఏజెంట్ల ద్వారా, మా ఏజెంట్ల రోజువారీ ప్రభావాన్ని మరియు వారు సేవలందించే కస్టమర్‌ల జీవితాల్లో వారు సృష్టించే శాశ్వత వ్యత్యాసాన్ని మేము జరుపుకుంటామన్నారు.ప్రచారం వెనుక ఉన్న వ్యూహాత్మక ఆలోచన గురించి ఇండియాఫస్ట్ లైఫ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శుభాంకర్ సేన్‌గుప్తా మాట్లాడుతూ, "ఇండియాఫస్ట్ లైఫ్‌లో, ప్రజలు తమ బాధ్యతల గురించి తేలికగా భావించడంలో మా బ్రాండ్ వాగ్దానం నిర్మించబడింది. 'ఆజాది ఏజెంట్లు' ఆ ఆలోచనను విస్తరింపజేస్తుందన్నారు.ఈ ప్రచారం ద్వారా, కస్టమర్‌లు వారి ఆర్థిక ప్రయాణాలను నావిగేట్ చేయడంలో ఏజెంట్‌లు పోషించే పాత్రకు మరింత దృశ్యమానతను తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు.

నేడు జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్, వైస్-ఛైర్ పర్సన్ ల ఎన్నిక : జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి వినోద్ కుమార్

బాపట్ల నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్, వైస్-ఛైర్ పర్సన్ ల ఎన్నిక ప్రక్రియ ఈనెల 20వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటలకు బాపట్లలో జరుగుతుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్, వైస్-ఛైర్ పర్సన్ ల ఎన్నిక కోరం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుల సంఖ్య 20 ఉండగా, నిబంధన ప్రకారం కోరం 10 మంది సభ్యులు ఉండాలన్నారు. సభ్యులు చేతులు పైకెత్తి ఓటు వేయడం ద్వారా ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నిక పూర్తయిన వెంటనే నామినేట్ చేయబడిన వ్యక్తుల పేర్లను ప్రకటించాలన్నారు. ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్, వైస్-ఛైర్ పర్సన్ లతో ప్రమాణ స్వీకారం చేయించి, ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్నారు. తదుపరి నూతనంగా ఎన్నికైన సంస్థ పదవీకాలం ప్రారంభమైనట్లు ప్రకటిస్తారన్నారు. తద్వారా పరిపాలనా సంస్థకు జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ అధ్యక్షత వహిస్తూ మొదటి సమావేశం నిర్వహిస్తారన్నారు. ఏదైనా కారణంచేత ఎన్నిక జరగకపోతే దీనిని మరుసటి రోజైన ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలన్నారు.

కలెక్టరేట్ గ్రంథాలయానికి

తొలి విరాళంగా పది పుస్తకాలు అందించిన ప్రధానోపాధ్యాయులు

బాపట్ల నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)


బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ చొరవతో కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ఉపాధ్యాయ వర్గం నుండి తొలి విరాళం అందింది. గ్రంథాలయ ప్రారంభోత్సవం సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఐదు పుస్తకాలను అందించి, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ పిలుపుకు స్పందించిన ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు స్వచ్ఛందంగా 10 పుస్తకాలను వితరణగా అందజేశారు. పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తూ, అందరికీ జ్ఞానాన్ని పంచే వేదికగా కలెక్టరేట్ గ్రంథాలయం రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషకరమని ఈ సందర్భంగా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తమ పిలుపును పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయ వర్గం తరపున ప్రప్రథమంగా స్పందించి 10 పుస్తకాలను బహూకరించిన ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

జనగణనను సమర్థవంతంగా పూర్తి చేయాలి : జీఎంసీ కమిషనర్

గుంటూరు నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

జనగణన-2027లో భాగంగా రెండో దశలో నిర్వహించనున్న జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియను గుంటూరు నగరంలో పకడ్బందీగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ శంకరన్ హాల్లో ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించే శిక్షణ తరగతుల్లో కమిషనర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) ప్రక్రియకు అవకాశం ఉంటుందన్నారు. జనవరి 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇంటింటి జనాభా గణన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మార్చి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పునఃపరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ఫీల్డ్ ట్రైనర్లు, తదుపరి సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు డిసెంబర్ రెండో వారంలో శిక్షణ అందించవలసి ఉంటుందన్నారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో శిక్షణ పొందాలని సూచించారు. జనగణన దేశ అభివృద్ధికి అవసరమైన కీలకమైన సమాచార సేకరణ ప్రక్రియ కావడంతో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సెన్సెస్ అధికారులు ప్రసన్నకుమార్, ఆదిలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌బీఎన్‌బీ ఆధ్వర్యంలో ఎట్ హోమ్ రాయ్‌చంద్





నెల్లూరు, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర) :
బాలీవుడ్ యొక్క అత్యంత ప్రసిద్ధ కుటుంబ గృహాలలో ఒకదానిలో గడిపే అవకాశాన్ని అభిమానులకు ఎయిర్‌బీఎన్‌బీ కల్పిస్తోంది.'కభీ ఖుషీ కభీ గమ్' (కే3జీ) 25 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, కరణ్, పూ పాత్రధారి కరీం కపూర్ ఖాన్ మరియు రోహన్‌లతో కూడిన బాలీవుడ్ అభిమానులు ఎక్కువ మంది ఇష్టపడే గృహాలలో ఒకదానిలో వినూత్న అనుభవాలను సొంతం చేసుకోవడానికి ఎయిర్‌బీఎన్‌బీ అభిమానులను ఆహ్వానిస్తోంది. ఈ చిత్రం తొలిసారిగా విడుదలై ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న 25 సంవత్సరాల తర్వాత, కే3జీ ప్రపంచానికి జీవం పోస్తూ, పునఃరూపకల్పన చేయబడిన రాయ్‌చంద్ హౌస్‌లోకి అభిమానులు మొదటిసారిగా అడుగుపెట్టే అవకాశం కల్పిస్తోంది.ఈ సందర్భంగా ఎయిర్‌బిఎన్‌బి ఇండియా హెడ్ అయిన అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ మాట్లాడుతూ ' కే3జీ ' చిత్రం ద్వారా ప్రేక్షకులకు రాయ్‌చంద్ కుటుంబాన్ని తొలిసారిగా పరిచయం చేసిన ఇరవై ఐదు సంవత్సరాల తర్వాత, ఎయిర్‌బీఎన్‌బీ దీనిని సాధ్యం చేస్తోందన్నారు. ఈ చిత్రం యొక్క 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ముంబైలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయ్‌చంద్ హౌస్‌ను ఎయిర్‌బీఎన్‌బీ పునఃరూపకల్పన చేస్తోందని చెప్పారు. 'ఎట్ హోమ్ విత్ ది రాయ్‌చంద్స్' పేరుతో అభిమానులను ఆహ్వానిస్తున్నామని, కే3జీ ప్రపంచాన్ని సృష్టించిన సినీ దర్శకుడు కరణ్ జోహార్, పూ పాత్రధారి కరీనాకపూర్ ఖాన్, రోహన్ రాయ్‌చంద్ హోస్ట్‌లుగా వ్యవహరించనున్నారని చెప్పారు. ఈ ప్రత్యేక అనుభవం ఎయిర్‌బీఎన్‌బీలో మాత్రమే అందుబాటులో ఉంటుందని, భారతీయ సినిమాలోని కొన్ని అత్యంత ఆదరణ పొందిన పాత్రలు, సంభాషణలు మరియు ఫ్యాషన్ క్షణాలను మనకు అందించిన చిత్రంగా, రాయ్‌చంద్ హౌస్ ఎల్లప్పుడూ దానికదే ఒక ప్రత్యేక ప్రపంచంగా నిలిచింది. కుటుంబ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నది ఇక్కడే. గ్రాండ్ ఎంట్రీలు జరిగాయి. పూ తనదైన ఫ్యాషన్ శైలితో ఆకట్టుకోగా, రోహన్ తన ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. ఇప్పుడు, అభిమానులు కేవలం తెరపైనే కాకుండా, ఆ ప్రపంచాన్ని స్వయంగా అన్వేషించే అవకాశం పొందవచ్చు అని చెప్పారు. పాత జ్ఞాపకాలు, ఫ్యాషన్, కుటుంబ అనుబంధాలు, కొంచెం డ్రామా మరియు మీలోని బాలీవుడ్ తారను బయటకు తీసుకువచ్చేందుకు ఎన్నో అవకాశాలు ఇప్పుడు ఇక్కడ మీకోసం ఎదురుచూస్తున్నాయి.ఈ సినిమాతో పెరిగి పెద్దయిన, అందులోని సంభాషణలను వల్లెవేసిన, ఐకానిక్ సన్నివేశాలను తిరిగి సృష్టించుకున్న తరతరాల అభిమానుల కోసం, 'ఎట్ హోమ్ విత్ ది రాయ్‌చంద్స్' ఒక సరికొత్త అనుభవాన్ని అందించనుందన్నారు. డిసెంబర్ 1 నుంచి 6 వరకు కేవలం 180 మందికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు.

ఉదయ్ శంకర్ అనే నేను

అనంతపురం, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర):
అనంతపురం రూరల్ మండలంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు గురువారం నగరంలోని రూరల్ మండల ఎంపిడిఓ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో జయకృష్ణ ను ఎంపీపీగా సభ్యులు ఎన్నుకోగా, ఉదయ్ శంకర్ ను వైస్ ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉదయ్ శంకర్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ఎంఎల్ఏ దగ్గుపాటి కి , అదేవిధంగా టిడిపి సీనియర్ నాయకులు జయరాం నాయుడు కి ,తోటి సభ్యులకు ఉదయ్ శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పదవిని నిబద్ధతతో పనిచేసి మండలంలోని ప్రతి గ్రామ అబివృద్ధి కోసం అంకితం చేస్తామని ఉదయ్ స్పష్టం చేశారు.

చల్లా జయక్రిష్ణ అనే నేను





అనంతపురం టౌన్, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర) :
అనంతపురం రూరల్ మండల ప్రజా పరిషత్ నూతన అధ్యక్షులుగా చల్లా జయక్రిష్ణ గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో స్థానిక శాసన సభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జయక్రిష్ణ మాట్లాడుతూ తనకు ఈ పదవికి సహకరించిన పరిటాల కుటుంబానికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

పోరుమామిళ్ల అభివృద్ధికి జే. రంగమ్మకు మద్దతుగా నిలవండి





బంగ్లా వీధిలో బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి
మంచూరు సూర్యనారాయణ రెడ్డి విస్తృత ప్రచారం

బద్వేలు, నవంబర్ 19 ((విజన్ ఆంధ్ర) విలేకరి)
బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జే. రంగమ్మ విజయాన్ని కాంక్షిస్తూ, బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని బంగ్లా వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోరుమామిళ్ల గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.గ్రామంలో ప్రధానంగా రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యల పరిష్కారం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.
రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, గ్రామ అభివృద్ధికి సహకరించే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.
ఈ సందర్భంగా స్థానిక ఓటర్లందరూ కూటమి అభ్యర్థి జే. రంగమ్మ కి తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంచూరు సూర్యనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బద్వేలు మండల అధ్యక్షురాలిగా బిజీ వేముల అపూర్వ



బద్వేలు,నవంబర్ 19 ((విజన్ ఆంధ్ర) విలేకరి)
బద్వేలు మండల అధ్యక్షురాలిగా బిజీ వేముల అపూర్వ ఎన్నికయ్యారు గురువారం బద్వేలు మండల కార్యాలయంలో ఎన్నిక జరిగింది.మండల ఎంపీటీసీలు అపూర్వను మండల అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. దీంతో అపూర్వ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు తెలుగుదేశం పార్టీకి చెందిన అపూర్వ కుటుంబం మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఆ పార్టీకి మద్దతు ఇస్తున్నారు.

మల్టీపర్పస్ డే కేర్ సెంటర్ ను సందర్శించిన

గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీ యోగానంద సరస్వతి





(విజన్ ఆంధ్ర) జిల్లా ప్రతినిధి ఆదిలాబాద్
బుధవారం సీనియర్ సిటిజన్స్ వయోవృద్ధుల కేంద్రాన్ని గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీ యోగానంద సరస్వతి. సందర్శించారు. వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లో ఉన్న వసతులను పరిశీలించి వారు చాలా సంతృప్తి చెంది, వయోవృద్ధులకు కాలక్షేపం కొరకు ఇలాంటి సదుపాయం కలగజేసిన తెలంగాణ ప్రభుత్వం యొక్క లక్ష్యం ఎంతో గొప్పదని కొనియాడారు. ఆదిలాబాద్ లో మంచి ఉద్దేశంతో ,లక్ష్యంతో వయోవృద్ధుల జిల్లా సమైక్య సభ్యులందరూ కార్యదీక్షతో ఎన్నో మంచి కార్యక్రమాలను, వయోవృద్ధుల సంక్షేమం, వయోవృద్ధుల 2007 చట్టం, గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీ RAJARSHI SHA IAS గారి అడ్మిస్ట్రేషన్లో చక్కగా క్రమశిక్షణతో నడిపిస్తున్నందుకు ఎంతో సంతోషపడుతూనాను అని తెలిపారు. ఆ తర్వాత సీనియర్ సిటిజెన్స్ ను ఉద్దేశించి బోధన చేస్తూ వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరికి మనశ్శాంతి, శేష జీవితంలో భార్య పిల్లలతో సంతోషంగా ఉండటమే లక్ష్యంగా, కలిసిమెలిసి జీవిస్తూ ఆరోగ్యంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. అలా ఉండటానికి మంచి అలవాట్లు, మంచి స్నేహం ,కుటుంబంలో బాంధవ్యం ప్రొద్దున సాయంత్రం ధ్యానం దానితోపాటు స్వల్ప వ్యాయామం నడక ఎంతో అవసరమని ఇవి పాటించడం చాలా వృద్ధాప్యంలో ముఖ్యమని తెలియజేశారు. కులమత వివక్ష లేకుండా అన్ని మతాల వారిని కలుపుకొని వయోవృద్ధుల జిల్లా సమైక్య ముందుకు తీసుకెళుతున్న డాక్టర్ దేవిదాస్ దేశ్ పాండే కి, వారి సహచర మిత్రులందరికి అభినందనలు తెలిపారు. సమాజంలో ప్రస్తుతం యువత మత్తు పానీయాల మత్తు పదార్థాల మరియు డ్రగ్స్ మాదకద్రవ్యాల నివారణ సీనియర్ సిటిజన్స్ ముందుండి పిల్లలకు యువతకు అవగాహన పరచటానికి ముందుండి కార్యక్రమాలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల జిల్లా సమైక్య అధ్యక్షులు డాక్టర్ దేవిదాస్ దేశ్పాండే సెక్రెటరీ రామకులకర్ణి ఆర్గనైజింగ్ సెక్రెటరీ శశికాంత్ సభ్యులు కమ్మల నరసింహులు దేవా సింగ్ పూర్ణచంద్రరావు జగదీష్ శ్యామ్ రాజ్ గౌడ్ శేషగిరి రావు రమేష్ శర్మ , సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం..

సర్పంచ్ బరిలో NRI శ్రీవీణా

స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు.. పంచాయతీ సమగ్ర అభివృద్ధికి హామీ

గాండ్లపెంట, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) విలేకరి)
శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం పరిధిలోని గాండ్లపెంట మండలం వేపరాల పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలోకి NRI వద్దిరెడ్డి శ్రీవీణా దిగారు. సర్పంచ్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా గురువారం ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవీణా మాట్లాడుతూ.. వేపరాల పంచాయతీ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. పంచాయతీ అభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, వేపరాలను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా పంచాయతీ ప్రజలందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని, ప్రజల ఆశీర్వాదం, సహకారంతో పంచాయతీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె తెలిపారు.

నంబులపూలకుంట ఎంపిపి గా

తెలుగుదేశం కమలమ్మ ఎన్నిక

నంబులపూలకుంట, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)
శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నంబులపూలకుంట మండల ఎంపీపీగా కమలమ్మ ఎన్నిక శ్రీ సత్యసాయి జిల్లా, నంబులపూలకుంట మండల తెలుగుదేశం పార్టీ ఎంపీపీగా కమలమ్మ ఎన్నికయ్యారు. ఆమె చంద్రశేఖర్ నాయుడు సతీమణి. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ కమలమ్మ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు. కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సహకారంతో నంబులపూలకుంట మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాము.

హెల్త్ సెంటర్‌కు ఆటోమేటిక్ బీపీ మెషిన్ విరాళం-రషద్ ఖాన్ సేవాభావం అభినందనీయం

(విజన్ ఆంధ్ర) సింగరేణి(నవంబర్ 19):
గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణకు తనవంతు సహకారం అందించాలనే సంకల్పంతో తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు మహమ్మద్ రషద్ ఖాన్ ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని హెల్త్ సెంటర్‌కు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి) ఆటోమేటిక్ బీపీ మెషిన్‌ను విరాళంగా అందజేశారు.
ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించి, ప్రభుత్వ వైద్య కేంద్రానికి ఉపయోగకరమైన పరికరాన్ని అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి రావడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొంటూ మహమ్మద్ రషద్ ఖాన్ సేవాభావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రు, ఉపసర్పంచ్ మల్లెల పావని, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనువాసరావు,బొల్ల రమేష్‌తో పాటు హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ జీవన్ చంద్ర శేఖర్ కుటుంబానికి

ప్రభుత్వం అండగా ఉంటుంది

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

- ప్రభుత్వ ప్రయోజనాలు వారి కుటుంబానికి త్వరగా అందేలా చర్యలు





కడప,నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

మృతి చెందిన గోపవరం తహసీల్దార్ ఆర్. జీవన్ చంద్రశేఖర్ కుటుంబానికి జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి భరోసా ఇచ్చారు.గురువారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.జేసీ డా. నిధీమీనా తో కలిసి జీవన్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా జీవన్ చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,జిల్లా యంత్రాంగం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు, ఇతర సహాయాలను త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.మరోవైపు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (APRSA) వైఎస్సార్ కడప జిల్లా శాఖ తరఫున జీవన్ చంద్రశేఖర్ కుటుంబానికిఅంత్యక్రియలు,కర్మకాండల ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు, మరో రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించడం సముచితమైన విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. మురళి, జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ పి. జాన్ ఇర్విన్, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.పి. రోనాల్డ్ శామ్యూల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక

20న మధ్యాహ్నం 1 గంటకు

- కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక వాయిదా

- జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డా.శ్రీధర్ చెరుకూరి

కడప,నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)



వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుగా నిర్ణయించిన ప్రకారం జెడ్పి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సి ఉంది. అయితే తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు సమయాన్ని మార్పు చేసి 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఎన్నికలను నిర్వహించ నున్నట్లు తెలిపారు.అయితే, అదే రోజు జరగాల్సిన కో-ఆప్టెడ్ సభ్యుని ఎన్నిక వాయిదా పడిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కో-ఆప్టెడ్ సభ్యుని ఎన్నిక నిర్వహణ తేదీని.. తదుపరి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖరారు చేసి ప్రకటించడం జరుగు తుందన్నారు.కావున ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు జడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు మాత్రమే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

ఖచ్చితమైన సమాచార సేకరణతోనే

దేశ అభివృద్ధికి పటిష్టమైన ప్రణాళికలు

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప,నవంబర్ 19 (విజన్ ఆంధ్ర)

జనగణన2027ను విజయవంతంగా నిర్వహించడంలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని.ఖచ్చితమైన సమాచారం సేకరణతోనే దేశ అభివృద్ధికి అవసర మైన పటిష్టమైనప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జనగణన2027 రెండవ దశ జనాభా గణనకు సంబంధించి నిర్వహించిన ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా.జనగణనలో చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు విధులపై పూర్తి అవగాహన కల్పించేలా ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ ఇవ్వాలని సూచించారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి సమర్థవంతంగా వివరించాలని, ప్రశ్నావళి, సమాచార సేకరణ పద్ధతులు, డిజిటల్ పరికరాల వినియోగంపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి నమ్మకాన్ని పొందాలని, సేకరించిన వ్యక్తిగత సమాచార గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని సూచించారు.జనగణన2027ను డిజిటల్ విధానంలో నిర్వహించ నున్నందున సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థ వంతంగా వినియో గించుకోవాలని,శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రైనర్లకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా జనగణన ఇన్‌చార్జి మోహన్ రమణ మాట్లాడుతూ జనగణన2027 రెండవ దశకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, శిక్షణ కార్యక్రమాలు, సిబ్బంది నియామకం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలను వివరించారు. ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని, ఎన్యుమరేటర్లకు నాణ్యమైన శిక్షణ అందించాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు, నగరపాలక సంస్థ కమిషనర్ భవానీ ప్రసాద్, సంబంధిత అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌బీఎన్‌బీ ఆధ్వర్యంలో ఎట్ హోమ్ రాయ్‌చంద్





విజయవాడ, నవంబర్ 19 (విజన్ ఆంధ్ర) :

బాలీవుడ్ యొక్క అత్యంత ప్రసిద్ధ కుటుంబ గృహాలలో ఒకదానిలో గడిపే అవకాశాన్ని అభిమానులకు ఎయిర్‌బీఎన్‌బీ కల్పిస్తోంది.'కభీ ఖుషీ కభీ గమ్' (కే3జీ) 25 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, కరణ్, పూ పాత్రధారి కరీం కపూర్ ఖాన్ మరియు రోహన్‌లతో కూడిన బాలీవుడ్ అభిమానులు ఎక్కువ మంది ఇష్టపడే గృహాలలో ఒకదానిలో వినూత్న అనుభవాలను సొంతం చేసుకోవడానికి ఎయిర్‌బీఎన్‌బీ అభిమానులను ఆహ్వానిస్తోంది. ఈ చిత్రం తొలిసారిగా విడుదలై ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న 25 సంవత్సరాల తర్వాత, కే3జీ ప్రపంచానికి జీవం పోస్తూ, పునఃరూపకల్పన చేయబడిన రాయ్‌చంద్ హౌస్‌లోకి అభిమానులు మొదటిసారిగా అడుగుపెట్టే అవకాశం కల్పిస్తోంది.ఈ సందర్భంగా ఎయిర్‌బిఎన్‌బి ఇండియా హెడ్ అయిన అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ మాట్లాడుతూ ' కే3జీ ' చిత్రం ద్వారా ప్రేక్షకులకు రాయ్‌చంద్ కుటుంబాన్ని తొలిసారిగా పరిచయం చేసిన ఇరవై ఐదు సంవత్సరాల తర్వాత, ఎయిర్‌బీఎన్‌బీ దీనిని సాధ్యం చేస్తోందన్నారు. ఈ చిత్రం యొక్క 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ముంబైలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయ్‌చంద్ హౌస్‌ను ఎయిర్‌బీఎన్‌బీ పునఃరూపకల్పన చేస్తోందని చెప్పారు. 'ఎట్ హోమ్ విత్ ది రాయ్‌చంద్స్' పేరుతో అభిమానులను ఆహ్వానిస్తున్నామని, కే3జీ ప్రపంచాన్ని సృష్టించిన సినీ దర్శకుడు కరణ్ జోహర్, పూ పాత్రధారి కరీనాకపూర్ ఖాన్, రోహన్ రాయ్‌చంద్ హోస్ట్‌లుగా వ్యవహరించనున్నారని చెప్పారు. ఈ ప్రత్యేక అనుభవం ఎయిర్‌బీఎన్‌బీలో మాత్రమే అందుబాటులో ఉంటుందని, భారతీయ సినిమాలోని కొన్ని అత్యంత ఆదరణ పొందిన పాత్రలు, సంభాషణలు మరియు ఫ్యాషన్ క్షణాలను మనకు అందించిన చిత్రంగా, రాయ్‌చంద్ హౌస్ ఎల్లప్పుడూ దానికదే ఒక ప్రత్యేక ప్రపంచంగా నిలిచింది. కుటుంబ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నది ఇక్కడే. గ్రాండ్ ఎంట్రీలు జరిగాయి. పూ తనదైన ఫ్యాషన్ శైలితో ఆకట్టుకోగా, రోహన్ తన ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. ఇప్పుడు, అభిమానులు కేవలం తెరపైనే కాకుండా, ఆ ప్రపంచాన్ని స్వయంగా అన్వేషించే అవకాశం పొందవచ్చు అని చెప్పారు. పాత జ్ఞాపకాలు, ఫ్యాషన్, కుటుంబ అనుబంధాలు, కొంచెం డ్రామా మరియు మీలోని బాలీవుడ్ తారను బయటకు తీసుకువచ్చేందుకు ఎన్నో అవకాశాలు ఇప్పుడు ఇక్కడ మీకోసం ఎదురుచూస్తున్నాయి.ఈ సినిమాతో పెరిగి పెద్దయిన, అందులోని సంభాషణలను వల్లెవేసిన, ఐకానిక్ సన్నివేశాలను తిరిగి సృష్టించుకున్న తరతరాల అభిమానుల కోసం, 'ఎట్ హోమ్ విత్ ది రాయ్‌చంద్స్' ఒక సరికొత్త అనుభవాన్ని అందించనుందన్నారు. డిసెంబర్ 1 నుంచి 6 వరకు కేవలం 180 మందికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు.

సికిల్ సెల్ అనీమియ, గర్భసయ క్యాన్సర్ ముక్త్ భారత్ సాధనే మన లక్ష్యం

:డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ



శిబ్యాల,రాయచోటి,నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

అన్నమయ్య జిల్లా శిబ్యాల గ్రామం లో సికెల్ సెల్ అనీమియా మరియు గర్భాశయ క్యాన్సర్ ముక్త్ భారత్ సాధనే మన లక్ష్యం అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు.అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు రాయచోటి మండలం యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని స్వర్ణ శిబ్యాల విలేజ్ హెల్త్ సెంటర్ పరిధిలోని కస్తూరిభా గురుకుల పాఠశాల మరియు ఏ. పి. ట్రైబల్ వెల్ఫేర్ బాలుర వసతిగృహాలలో ప్రిన్సిపాల్ లు ఆర్ .శశికళ, జి.గణేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డి. హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ సంవత్సరము తీమ్ "జీవన అంతరాన్ని తగ్గించడం సికెల్ సెల్ వ్యాధిలో సమానత్వం "సికెల్ సెల్ అనీమియా రక్తపరీక్షలు సున్నా నుండి 40సంవత్సరాలలోపు ప్రజలు ముక్యంగా గిరిజన జాతులకు చెందిన వారు, ఎత్తయిన ప్రదేశాలలో నివసించే వారు, కొండ ప్రాంతాలలో అందరు చేయించుకోవాలని అన్నారు. గురువారం సికిల్ సెల్ రక్తహీనత పై 2047సంవత్సరానికి సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్ లో భాగంగా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. సికెల్ సెల్ అనీమియా వ్యాధి వారస్వతంగా వచ్చే ఎర్ర రక్తకణముల వ్యాధి. ఈ జబ్బు తల్లిదండ్రుల నుండి జన్యుపరంగా పిల్లలకు వస్తుంది. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి లక్షణాలు రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగు లోకి మారడం, తీవ్రమైన వళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవడం లో కష్టం, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు, గర్భ ధారణ సమయం లో సమస్యలు, అవయవ వైపల్యం, పెరుగుదల సమస్యలు. ఈ వ్యాధి నిర్ధారణ కొరకు ప్రతీ ఆరోగ్య కార్యకర్త దగ్గర పరీక్ష కిట్స్ అందుబాటులో ఉన్నాయి. ఒక్క చుక్క రక్తం తో పరీక్ష చేసుకోవచ్చు.వ్యాధి నిర్ధారణ ఐతే హైడ్రాక్సీ యూరియా మాత్రలు తో పాటు ఫోలిక్ ఆసిడ్ మాత్రలు కూడా ఇవ్వడం జరుగుతుంది. అవసరం ఐతే రక్తం ఎక్కించాలిసి వస్తుంది.వివాహానికి ముందు అమ్మాయి, అబ్బాయి ఇద్దరు సికిల్ సెల్ రక్త పరీక్షలు చేయించుకోవాళన్నారు. ప్రతీ సచివాలయం లో ఉన్న ఆరోగ్య కార్యకర్తల దగ్గర కిట్లు అందుబాటులో ఉన్నాయని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాళన్నారు.వ్యాధి యొక్క స్థాయి ని బట్టి ఎముక మజ్జ మార్చబడుతుంది అన్నారు. అనంతరం బ్రోచర్లు, కరపత్రాలు ఆవిష్కరణ చేసి పంపిణీ చేయడం,సికిల్ సెల్ అనీమియా ప్రజల భాగస్వామ్యం,విద్యార్థుల తో ర్యాలీ, ప్రతిజ్ఞ చేయడం జరిగింది. 14సంవత్సరాలు పూర్తి అయి 15సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు గర్భసయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా హెచ్. పి. వి. వాక్సిన్స్ అన్ని ఆరోగ్య కేంద్రాలలో వేస్తున్నామని, అర్హులైన అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పొగాకు రహిత యువత ప్రచారం 4.0లో భాగంగా పొగాకుకు సంబందించిన పదార్థాలను తినడం వలన కలిగే అనారోగ్యం గురించి వివరించారు.విద్యార్థులు చేత నినాదాలు చేస్తూ ప్లేకార్డ్స్ ప్రదర్శన చేయడం జరిగింది.. ఈ కార్యక్రమం లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ,ఎమ్. పి. హెచ్. ఈ. ఓ. సుధాకర్ రాజు, యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ యర్రపురెడ్డి విశ్వనాధ్ రెడ్డి, ఏ. ఎన్. ఎమ్. జె.విజయసలోమి, ఉపాధ్యాయులు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



కదిరి రూరల్ మండల ఎంపీపీగా దీపా బాయి ఎన్నిక

చక్రం తిప్పిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, నవంబర్ 19 ((విజన్ ఆంధ్ర) ప్రతినిధి)

శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి రూరల్ మండల ఎంపీపీ ఎన్నిక ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కదిరి రూరల్ మండల ఎంపీపీ ఎన్నికకు సంబంధించి నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులంతా గైర్హాజరు కాగా, తెలుగుదేశం పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు.

ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా కదిరి రూరల్ మండల ఎంపీపీగా తెలుగుదేశం పార్టీకి చెందిన దీపా బాయి ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కీలక పాత్ర పోషిస్తూ రాజకీయంగా చక్రం తిప్పారు. పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించారు.



ఎంపీపీగా ఎన్నికైన దీపా బాయికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

జిల్లాలో గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల షెడ్యూల్ విడుదల

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్

అనకాపల్లి, నవంబర్ 19((విజన్ ఆంధ్ర) ప్రత్యేక ప్రతినిధి)

అనకాపల్లి జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు - 2026 మూడవ విడత (ఫేజ్-III) ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం ఉదయం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్, తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ నెం. 1800/SEC-B2/2026, Dt. 19-11-2026 జారీ అయిందన్నారు.

జిల్లాలో మూడవ విడతలో అనకాపల్లి రెవిన్యూ డివిజన్ కు సంబంధించి చీడికాడ, దేవరాపల్లి, కె కోటపాడు మండలాల్లో, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కు సంబంధించి V.మాడుగల, గొలుగొండ, మాకవరపాలెం, నర్సీపట్నం మరియు నాతవరం మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2006 ప్రకారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూల్స్ లోని 6 నియమం కింద ఎన్నికల నోటీసు జారీ మరియు గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారి జారీ చేసిన రూల్ 5 ప్రకారము వార్డు వారీ ఓటర్ల జాబితా ప్రదర్శన నవంబర్ 21, 2026 (ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు)

నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 23, 2026 (సాయంత్రం 5:00 వరకు).

నామినేషన్ల పరిశీలన నవంబర్ 24, 2026 (ఉదయం 8:00 నుండి).

నామినేషన్ల తిరస్కృతిపై అప్పీల్ దాఖలుకు అవకాశం (రెవెన్యూ డివిజనల్ అధికారి పరిశీలన) నవంబర్ 25, 2026 (సాయంత్రం 5:00 వరకు).

అప్పిలేట్ అధికారి ద్వారా అప్పీళ్ళ పరిష్కారం చివరి తేదీ నవంబర్ 26, 2026.

నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 27, 2026 (సాయంత్రం 3:00 వరకు).

అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నవంబర్ 27, 2026 (సాయంత్రం 3:00 తర్వాత).

పోలింగ్ డిసెంబర్ 2, 2026 (ఉదయం 7:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు).

ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటన: డిసెంబర్ 2, 2026 (మధ్యాహ్నం 2:00 నుండి లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన).

ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించబడుతుంది.

ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైనచో 3-12-2026 ఉదయం 7-00 గంటల నుంచి మధ్యాహ్నం 1-00 వరకు నిర్వహించడం జరుగుతుందని, మధ్యాహ్నం 2-00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేసి, కోట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి ఫలితం ప్రకటించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అభ్యర్థులు మరియు ఓటర్లు అందరూ ఈ ముఖ్యమైన తేదీలు, సమయాలను గమనించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ కోరారు.

The imprint line should be printed legibly as Printed by Published by JAKKULA NARENDER on behalf of JAKKULA NARENDER, printed at and published at 76-6-01 BHATSING ROAD CHATIYNA APTS NEAR SWATHI CENTER BHAVANIPURAM VIJAYAWADA editor JAKKULA NARENDER.